నేడు హౌస్ కమిటీ రాక

- విశాఖ డెయిరీలో అక్రమాలపై విచారణ
- రికార్డులు పరిశీలించనున్న సభ్యులు

విశాఖ డెయిరీలో అక్రమాలపై విచారణకు నియమించిన హౌస్‌కమిటీ సోమవారం గాజువాక ప్రాంతంలోని అక్కిరెడ్డిపాలెంలో వున్న డెయిరీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించనుంది.

- వార్త 7వ పేజీలో

ఇంకెన్నాళ్లు ఇసుక కష్టాలు!

జిల్లాకు ఆరు డిపోలు మంజూరు చేసిన ప్రభుత్వం

- గత నెల 30వ తేదీనాటికి దరఖాస్తుల స్వీకరణ పూర్తి
- ఆరు డిపోల కోసం 43 దరఖాస్తులు
- లాటరీ విధానంలో కేటాయింపులో తీవ్ర జాప్యం
- కొనసాగుతున్న ఇసుకాసురుల దందా
- భవన నిర్మాణదారుల ఇక్కట్లు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా ఉంది.. జిల్లాలో ఇసుక డిపోల ఏర్పాటు తీరు. ఇసుక కొరతను అధిగమించడానికి జిల్లాలో ఆరు డిపోలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగిసి వారం రోజులు దాటినా.. ఇంతవరకు ఇసుక డిపోల నిర్వాహకులను ఎంపిక చేయడానికి అధికారులు లాటరీ తీయలేదు. మరోవైపు భవన నిర్మాణదారులకు ఇసుక అందుబాటులో లేకపోవడంతో దళారుల నుంచి అధిక ధరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం తరపున ఇసుక డిపోల ఏర్పాటు జాప్యం అవుతుండడంతో అక్రమార్కులు నదుల్లో మరింత అధికంగా ఇసుక తవ్వకాలు జరుపుతూ, పెద్ద ఎత్తున నిల్వ చేస్తున్నారు.



అనకాపల్లి పట్టణంలో ఇసుక రవాణా చేస్తున్న లారీ



రాంబిల్లి మండలం వైలోవ వద్ద శారదా నదిలో తవ్వి, సమీపంలో నిల్వ చేసిన ఇసుక కుప్పలు

భవన నిర్మాణదారులకు ఇసుకను అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని అమలు చేస్తున్న విషయం తెలిసింది. అయితే జిల్లాలోని నదుల్లో తగినంత ఇసుక నిల్వలు లేకపోవడంతో అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల, అచ్యుతాపురం, పాయకరావుపేటల్లో ప్రైవేటు వ్యక్తులకు ఇసుక డిపోల నిర్వహణ బాధ్యతలను అప్పగించాలని భావించింది. ఇసుక డిపోల ఏర్పాటు కోసం గత నెల 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 43 దరఖాస్తులు అందాయి. అత్యధికంగా అనకాపల్లిలో ఇసుక డిపో ఏర్పాటుకు 11 దరఖాస్తులు, నక్కపల్లికి 10, అచ్యుతాపురానికి 9, నర్సీపట్నానికి 8, చోడవరానికి 3, మాడుగులకు 2 దరఖాస్తులు అందాయి. ఈ నెల ఒకటి లేదా రెండు తేదీల్లో దరఖాస్తులను పరిశీలించి, నిరభ్యంతర పత్రాలు సమర్పించి వారిలో ఒక్కొక్కరి చొప్పున లాటరీ ద్వారా ఎంపిక చేయాలని నిర్ణయించారు. ఈ నెల మొదటి వారంలోగా ప్రక్రియను పూర్తి చేయాలని అనుకున్నారు. కానీ వారం రోజులు దాటినప్పటికీ ఇసుక డిపోల కేటాయింపునకు లాటరీ ప్రక్రియ నిర్వహించలేదు. దీనిపై గనుల శాఖ అధికారులకు కూడా స్పష్టత లేదు. అయితే అనధికార వర్గాల సమాచారం మేరకు.. ఇసుక నిల్వ ఉంచేందుకు అవసరమైన స్థలం లీజు పత్రాలను దరఖాస్తుదారుల్లో కొంతమంది ఇంకా సమర్పించలేదని తెలిసింది. మరోవైపు కొంతమంది ప్రజాప్రతినిధులు ఇసుక డిపోలు తమ అనుచరులకే దక్కేలా అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నట్టు ... మిగతా 6వ పేజీలో

వైభవంగా కొండగుడి ఉత్సవం



విశాఖలోని పాత పోస్టాఫీసు సమీపంలో ఉన్న రోజ్ హిల్ అమలోద్భవి మాత (కొండగుడి) ఉత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉత్తర కోస్తా జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో వన్ టౌన్ ప్రాంతమంతా కిటకిటలాడింది. భక్తులు కొండకు చేరుకుని మేరీమాత విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

- విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి)

కొండగుడి ఉత్సవంలో మేరీమాత విగ్రహాన్ని ఊరేగిస్తున్న విశ్వాసకులు

మహిళా మార్టుల్లో బలవంతపు కొనుగోళ్లు

డ్వాక్రా సంఘాల పొదుపు ఖాతాల నిధులు డ్రా చేయిస్తున్న వెలుగు సిబ్బంది

మాకవరపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):

డ్వాక్రా సంఘాల పొదుపు ఖాతాల నుంచి నిధులు డ్రా చేసి, మహిళా మార్టులో సరకులు కొనుగోలు చేయాలని వెలుగు సిబ్బంది ఒత్తిడి తెస్తున్నారు. ఏ నెలకు ఆ నెల కాకుండా ఏడాది మొత్తానికి ఒకేసారి సరకులు తీసుకోవాలని చెబుతుండడంతో డ్వాక్రా మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- ప్రతి సభ్యురాలు ఏడాదికి సరిపడ సరకులు కొనుగోలు చేయాలని ఒత్తిడి
- రశీదు చూపితేనే బ్యాంకుల నుంచి రుణాలు
- అధికారుల తీరుపై డ్వాక్రా సభ్యులు ఆగ్రహం



మాకవరపాలెంలో మార్టు వద్ద డ్వాక్రా మహిళలు (ఫైల్ ఫొటో)

మాకవరపాలెం మండలంలో 1,523 డ్వాక్రా సంఘాలు వున్నాయి. వీటిల్లో దాదాపు 16 వేల మంది మహిళలు సభ్యులుగా వున్నారు. డ్వాక్రా సంఘాల స్వయం సమృద్ధి పేరుతో గత వైసీపీ ప్రభుత్వం ఈ ఏడాది జనవరి నెలలో వైఎస్సార్ మహిళా మార్టు'ను ప్రారంభించింది. అంతకు ముందు వెలుగు అధికారులు ఒక్కో డ్వాక్రా సభ్యురాలి నుంచి రూ.250 చొప్పున దాదాపు రూ.40 లక్షలు వసూలు చేశారు. మార్టును ప్రారంభించిన తరువాత.. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునే సభ్యులు ఒకొక్కరు నెలకు కనీసం రూ.250 విలువైన సరకులు కొనాలని షరతు విధించారు. మారుమూల గ్రామాల నుంచి ఆటోల్లో మాకవరపాలెం వచ్చి, మహిళా మార్టులో సరకులు కొనుగోలు చేసి, తిరిగి ఆటోల్లోనే ఇళ్ల వెళ్లేవారు. మార్టులో లభించే సరకులు తమ గ్రామాల్లో ఇంతకన్నా తక్కువ ధరలకు లభిస్తున్నాయని, మార్టులో సరకుల కొనుగోలు కోసం రావడంవల్ల ఆటో చార్జీల రూపంలో అనవసర వ్యయం, విలువైన సమయం వృథా అవుతున్నాయని మహిళలు వాపోయారు. తరువాత ఎన్నికల సమయంలో డ్వాక్రా మహిళల నుంచి పెద్ద ఎత్తున వినతులు రావడంతో కూటమి నాయకులు స్పందించారు. వారి భరోసా మేరకు మార్టులో బలవంతపు సరకుల కొనుగోళ్లు నిలిపివేశారు. ఎన్నికలు ముగిసిన తరువాత వెలుగు సిబ్బంది స్త్రీనిధి, బ్యాంకు రుణాల మంజూరు ప్రక్రియ మొదలుపెట్టారు. అయితే రుణాలు తీసుకునే మహిళలు తప్పనిసరిగా వారి పొదుపు ఖాతా నుంచి ... మిగతా 6వ పేజీలో

ప్రమాదాల హైవే

'పేట నుంచి సబ్బవరం వరకు ప్రాణాలు తీస్తున్న పలు జంక్షన్లు



డేంజర్ జోన్‌గా ముద్రపడిన నక్కపల్లి మండలం ఉద్దండపురం జంక్షన్

పాయకరావుపేట/ నక్కపల్లి/ ఎస్.రాయవరం/ ఎలమంచిలి/ కశింకోట/ అనకాపల్లి టౌన్/ సబ్బవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో పాయకరావుపేట నుంచి సబ్బవరం వరకు జాతీయ రహదారిపై పలు జంక్షన్లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. స్టాపర్ బోర్డులు లేకపోవడం, బ్లింకర్లు ఏర్పాటు చేయకపోవడంతో వాహన చోదకులు వేగాన్ని నియంత్రించడంలేదు. దీంతో ఆయా జంక్షన్ల వద్ద రోడ్డు దాటుతున్న పాదచారులు, వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. పాయకరావుపేట నుంచి సబ్బవరం వరకు 30కిపైగా జంక్షన్లు వుండగా, వీటిలో సగం జంక్షన్లలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి నవంబరు వరకు 260కిపైగా ప్రమాదాలు జరగ్గా.. 107 మంది మృత్యువాత పడ్డారు. ఇంతకు రెట్టింపు సంఖ్యలో క్షతగాత్రులయ్యారు. అత్యధికంగా నక్కపల్లి మండలంలో 27 మంది, కశింకోట మండలంలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. హైవేపై ప్రమాదాల నివారణకు ప్రభుత్వ శాఖలు చర్యలు చేపట్టాయి. ఎన్‌హెచ్ఏఐ, రవాణా, ఆర్అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి జాతీయ రహదారిపై తరచూ వాహన ప్రమాదాలు జరిగే ప్రదేశాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించారు. ఈ ప్రదేశాల వద్ద ప్రమాదాల నిరోధానికి సోలార్ బ్లింకర్ లైట్లు, రేడియం రిబ్బన్లు, రంబుల్ స్ట్రిప్స్, స్టాపర్ బోర్డులు, సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తారు.

- ఈ ఏడాది జనవరి నుంచి నవంబరు వరకు 260కిపైగా ప్రమాదాలు
- 107 మంది మృత్యువాత, రెట్టింపు సంఖ్యలో క్షతగాత్రులు
- తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలు బ్లాక్ స్పాట్‌లుగా గుర్తింపు
- పోలీసు, ఎన్‌హెచ్ఏఐ, రవాణా శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు

'పేట మండలంలో 12 మంది మృతి

అత్యధికంగా నామవరం జంక్షన్‌లో ఏడుగురు..



పదకొండు నెలల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోయిన పాయకరావుపేట మండలం నామవరం జంక్షన్

పాయకరావుపేట మండలంలో జాతీయ రహదారిపై నాలుగు బ్లాక్ స్పాట్‌లను పోలీసు, రవాణా శాఖల అధికారులు గుర్తించారు. పాయకరావుపేట పట్టణంలోని తాండవ జంక్షన్, కనోసా స్కూల్, మండలంలో నామవరం, శ్రీరాంపురం జంక్షన్‌లలో తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. వీటిల్లో నామవరం జంక్షన్ అత్యంత ప్రమాదకరమైనది. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి నవంబరు వరకు జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 12 మంది మృతిచెందారు. వీరిలో ఏడుగురు నామవరం జంక్షన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందడం గమనార్హం. తాండవ జంక్షన్‌లో ముగ్గురు చనిపోయారు. ఇక అన్ని ప్రమాదాల్లో కలిపి 10 మంది గాయపడ్డారు. రోడ్డు దాటుతున్నప్పుడు జరిగిన ప్రమాదాలే అత్యధికంగా వుండడం విశేషం.

బ్లాక్ స్పాట్‌లు అంటే...



ఏడాదిలో ఒకేచోట మూడు రోడ్డు ప్రమాదాలు జరిగితే ఆ ప్రదేశాన్ని బ్లాక్ స్పాట్‌గా గుర్తిస్తారు. ఆ ప్రదేశానికి సమీపంలో పుర్రె బొమ్మతో 'బ్లాక్ స్పాట్' అని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తారు. జాతీయ రహదారి భద్రతా అధికారులు కూడా వాటిని గుర్తించే విధంగా జీబ్రా క్రాసింగ్, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేస్తారు.

ప్రాణాలు తీస్తున్న ఉద్దండపురం జంక్షన్

- 11 నెలల్లో ఏడుగురు మృతి

నక్కపల్లి మండలంలో గొడిచెర్ల, ఉద్దండపురం, వేంపాడు, వెదుళ్లపాలెం, నక్కపల్లిలో ఉపమాక హైవే జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, ఆస్పత్రి జంక్షన్ల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గొడిచెర్ల, ఉద్దండపురం హైవే జంక్షన్లను అత్యంత ప్రమాదకరమైనవి పోలీసు అధికారులు గుర్తించారు. ఎక్కువ ప్రమాదాలు ఈ రెండు జంక్షన్లలోనే జరుగుతున్నాయి. ఉపమాక జంక్షన్, నక్కపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్, ఆస్పత్రి జంక్షన్, గొడిచెర్ల, ఉద్దండపురం జంక్షన్ల వద్ద లైట్లు లేకపోవడంతో రాత్రిపూట పాదచారులు, ద్విచక్ర వాహనదారులు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలబారిన పడుతున్నారు. నక్కపల్లి మండలంలో ఈ ఏడాది జనవరి నుంచి డిసెంబరు 4వ తేదీ వరకు 57 రోడ్డు ప్రమాదాలు జరగగా, 27 మంది మృత్యువాత పడ్డారు. 29 మంది క్షతగాత్రులయ్యారు. ఉద్దండపురం జంక్షన్ వద్ద జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం విచారకరం. మిగిలిన 20 మంది గొడిచెర్ల, నక్కపల్లి, వెదుళ్లపాలెం, వేంపాడు, ఒడ్డిమెట్ట, న్యాయంపూడి జంక్షన్ల వద్ద జరిగిన ప్రమాదాల్లో చనిపోయారు.



బ్లాక్‌స్పాట్‌గా గుర్తించిన కశింకోట జంక్షన్

కశింకోట మండలంలో ఎనిమిది బ్లాక్ స్పాట్‌లు

కశింకోట మండలంలో బయ్యవరం, హెరిటేజ్ కూడలి, కశింకోట, తాళపాలెం, నర్సింగబిల్లి, జమాదులపాలెం, గొబ్బూరు, ఎన్.జి.పాలెం గ్రామాలను బ్లాక్ స్పాట్‌లుగా ... మిగతా 6వ పేజీలో



తరచూ ప్రమాదాలు జరిగే ఎస్.రాయవరం మండలం గోకులపాడు జంక్షన్

బ్లాక్ స్పాట్‌లపై సంయుక్త తనిఖీలు



మా పరిధిలో వున్న ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో జాతీయ రహదారిపై 12 ప్రాంతాల్లో తరచూ వాహన ప్రమాదాలు జరుగుతున్నట్టు నిర్ధారించి వీటిని బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించాము. ఎస్పీ ఆదేశాల మేరకు రెండు రోజుల క్రితం ఎన్‌హెచ్ఏఐ, రవాణా, ఆర్అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి బ్లాక్ స్పాట్స్‌ను సంయుక్తంగా తనిఖీ చేశాం. బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నిరోధానికి సోలార్ బ్లింకర్ లైట్లు, రేడియం రిబ్బన్లు, రంబుల్ స్ట్రిప్స్, స్టాపర్ బోర్డులు, సైన్ బోర్డులు ఏర్పాటు చేసి, జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని నివేదిక తయారు చేసి ఎస్పీకి అందజేశాం.

జీఆర్ఆర్ మోహన్, డీఎస్పీ, నర్సీపట్నం

ట్రాక్టర్ ఢీకొని ఇటుకల వ్యాపారి మృతి

నర్సీపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):

స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇటుకల వ్యాపారి మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి.



రామచంద్రరావు (ఫైల్ ఫొటో)

నర్సీపట్నం మునిసిపాలిటీ రామారావుపేటలో నివాసం ఉంటున్న గంగుబోగుల రామచంద్రరావు ఇటుకల వ్యాపారం చేస్తుంటాడు. ఆదివారం మధ్యాహ్నం వ్యక్తిగత పనిమీద ద్విచక్రవాహనంపై ఇర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్దకు వెళ్లాడు. తిరిగి రామారావుపేటలో ఇంటికి వెళ్లే క్రమంలో బైక్ మలుపు తిప్పుతుండగా జోగినాథునిపాలెం నుంచి అబీద్ సెంటర్ వైపు వెళుతున్న ట్రాక్టర్ ఢీ కొట్టింది. దీంతో రామచంద్రరావుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్షకు 3,682 మంది హాజరు

అనకాపల్లి రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) అర్హత పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగినట్టు జిల్లా విద్యా శాఖాధికారి జి.అప్పారావు నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని రెండు డివిజన్ల పరిధిలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో 3,890 మంది దరఖాస్తు చేసుకోగా, ఆదివారం నిర్వహించిన అర్హత పరీక్షకు 3,682 మంది హాజరైనట్టు తెలిపారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు నాలుగేళ్లపాటు స్కాలర్‌షిప్ లభిస్తుందన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, వైద్య సిబ్బందిని అందుబాటులో వుంచినట్టు ఆయన చెప్పారు.

నీరడిగి నోరెండుతోంది!

- ఏళ్ల తరబడి పరిష్కారం కాని తాగునీటి సమస్య
- ఎన్టీఆర్ కాలనీలో ప్రజల ఆక్రోశం

ఎలమంచిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి పరిష్కారంకాని సమస్యలతో నిరుపేదల కాలనీవాసులు సతమతమవుతున్నారు. మున్సిపల్ అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. తాగునీటి సమస్యకు తెరదించాలని, ఇళ్ల ముందు మురుగునీరు నిలిచిపోకుండా డ్రైనేజీని ఆధునికీకరించాలని కోరుతున్నారు. ఎలమంచిలి మేజర్ పంచాయతీగా ఉన్నప్పుడు టీడీపీ ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు స్థలాలు కేటాయించి ఎన్టీఆర్ పేరిట కాలనీని మంజూరు చేశారు. ఈ కాలనీ సుమారు 150 నివాస గృహాలతో మున్సిపాలిటీలోని 24వ వార్డులో సగ భాగం, 25వ వార్డులో సగం విస్తరించి ఉంది. ఇంతవరకూ కాలనీలో పూర్తి స్థాయిలో తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయలేదు. అరకొరగా ఉన్న కుళాయిల నుంచి రెండు రోజులకోసారి నీరు వస్తుందని చెబుతున్నారు. పంట పొలాల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు చెప్పినా పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో సగం వీధులకు మాత్రమే డ్రైనేజీలు ఉన్నందున మురుగు నీరు రోడ్డుపైనే నిలిచిపోతోందని పేర్కొంటున్నారు. ఇళ్ల ముందు మురుగు నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోందని, ఫలితంగా దోమల తీవ్రత పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అంటున్నారు. రహదారులను అసంపూర్తిగా నిర్మించారని వాపోయారు. తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా ఈ కాలనీలో కనీస వసతులు కల్పించాలని కోరుతున్నారు.



ఎన్టీఆర్ కాలనీలోని ఓ వీధిలో దెబ్బతిన్న రోడ్డు



తమ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న మహిళలు

హరిపురంలో జనవాణి నేడు

రాంబిల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాంబిల్లి మండలం హరిపురంలోని జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం జనవాణి కార్యక్రమం జరుగుతుందని టీడీపీ, జనసేన రాంబిల్లి మండల శాఖల అధ్యక్షులు వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొరలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ హాజరవుతారన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య ఆయన ప్రజల సమస్యలు తెలుసుకొని అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని నేతలు కోరారు.

ఎలమంచిలిలో డిజిటల్స్ ప్రారంభం



అరుణాచల డిజిటల్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

అచ్యుతాపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి రోడ్డులో అరుణాచల డిజిటల్స్‌ని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆదివారం ప్రారంభించారు. ఆధునిక యంత్రాలతో ఏర్పాటు చేసిన ఈ డిజిటల్స్ పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీభాస్కర్, లాలం చందు, సుందరపు రవికుమార్, కూటమి సభ్యులు పాల్గొన్నారు.

550 మందికి కంటి వైద్యపరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బ్రాండిక్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 550 మంది పాల్గొనగా 417 మందిని పరీక్షించారు. ఇందులో 282 మందికి ఉచితంగా కంటి అద్దాలు, 90 మందికి మందులు ఇచ్చారు. 45 మందికి శస్త్రచికిత్స చేయాలని వైద్యబృందం నిర్ణయించింది. ఉచితంగా పులిహోర, మజ్జిగ, భోజనాలు సమకూర్చారు.

పశువుల వ్యాన్ సీజ్

నక్కపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేంపాడు టోల్ ప్లాజా వద్ద ఆదివారం పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నామని ఎస్‌ఐ సన్నిబాబు తెలిపారు. సిబ్బందితో తనిఖీ చేస్తుండగా అనుమతులు లేకుండా ఎనిమిది పశువులను తరలిస్తున్న బొలెరో వాహనాన్ని పట్టుకుని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. పశువులను గో సంరక్షణ శాలకు తరలించామని చెప్పారు.

పూర్వ విద్యార్థుల వనసమారాధన



1983లో పదో తరగతి చదువుకున్న తన చిన్ననాటి స్నేహితులతో కలిసి ఎలమంచిలి సమీపంలో ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న జిల్లా జడ్జి పూసా శ్రీనివాసు

ఎలమంచిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి పట్టణ సమీపంలోని తోటలో ఆదివారం 1983వ సంవత్సరం పదో తరగతి, ఇంటర్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు కలిసి వన సమారాధన కార్యక్రమం నిర్వహించినట్లు పూర్వ విద్యార్థి ఆడారి రమణబాబు తెలిపారు. ఆత్మీయ కలయికలో జిల్లా జడ్జి పూసా శ్రీనివాసు పాల్గొని తోటి స్నేహితులతో తన విద్యార్థి దశ జ్ఞాపకాలు పంచుకున్నారని పేర్కొన్నారు. మధుర స్మృతులను గుర్తు చేసుకుని వనసమారాధన కార్యక్రమంలో ఆనందోత్సాహాలతో గడిపినట్లు తెలిపారు. శెలంశెట్టి నాగశేషు ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. అతికిన శెట్టి సత్యనారాయణ, రేఖావాసు, వి.ఆనంద్, సూరిశెట్టి సూర్య, షేక్ గౌస్, వర్మ, వనుం బాలు, పద్మ, ఉత్తరకుమారి, సూర్యశ్రీ తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

బండరాళ్లు తరలిస్తున్న రెండు లారీలు ఢీ

- లారీల మధ్య తెగిపడిన ఓ డ్రైవర్ కుడి కాలు
- కుటుంబ పోషణ ఎట్లా అంటూ విలపించిన క్షతగాత్రుడు
- సోమన్నపాలెం వద్ద ప్రమాదం



సోమన్నపాలెం వద్ద ప్రమాదానికి గురైన రెండు లారీలు రోడ్డుపై పడిన బండరాళ్లు



కాలు తెగిపడిన గొల్లబాబును ఆసుపత్రికి తరలించేందుకు 108 వాహనం వద్దకు తీసుకెళ్తున్న ఎస్‌ఐ, స్థానికులు

ఎలమంచిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమన్నపాలెం గ్రామం పాత జాతీయ రహదారి జంక్షన్ వద్ద ఆదివారం బండరాళ్లు తరలిస్తున్న రెండు లారీలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కశింకోట మండలం కన్నూరుపాలెం సమీపంలోని ఆనందపురం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ లాలం గొల్లబాబు కుడికాలు తెగిపడింది. వెంటనే 108 వాహనంలో పోలీసుల సహాయంతో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మరో లారీ డ్రైవర్ మాకవరపాలెం మండలం రామారాయుడు పాలెం గ్రామానికి చెందిన మర్రి దేముడుకు స్వల్ప గాయాలయ్యాయి. లారీ బోల్తాతో రోడ్డంతా నల్లబండరాళ్లు పడిపోయాయి. వెనుక ఉన్న లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో ముందుభాగం నుజ్జయ్యింది. ప్రమాద స్థలం భయానకంగా ఉంది. లారీ శకటాల మధ్య ఇరుక్కుపోయిన గొల్లబాబును రక్షించేందుకు స్థానికులు, హోంగార్డు చంటి తీవ్రంగా యత్నించి బయటకు తీశారు. ఈ ప్రమాదంతో రోడ్డు పొడుగునా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. లారీ డ్రైవర్ దేముడు తెలిపిన సమాచారం ప్రకారం... రేలుగుంట ప్రాంతం నుంచి నల్లబండరాళ్లను రాంబిల్లి తరలించేందుకు వస్తుండగా సోమన్నపాలెం వద్దకు వచ్చేసరికి ముందుగా వెళ్తున్న కారు అడ్డుగా వచ్చింది. దాన్ని తప్పించే క్రమంలో లారీ అదుపు తప్పింది. వెనుక నుంచి మరో లారీ వచ్చి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని తెలిపాడు. ప్రమాద స్థలానికి రూరల్ ఎస్సై ఉపేంద్ర తన సిబ్బందితో చేరుకుని ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. కాలు తెగిపడిపోయిన డ్రైవర్ గొల్లబాబు తీవ్రంగా విలపిస్తూ... తనకు భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారని, తన కుటుంబాన్ని ఎలా పోషించగలను దేవుడా! అంటూ విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

వాడపాలెం తీరంలో పర్యాటక సందడి



అచ్యుతాపురం డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తంతడి శివారు వాడపాలెంలో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. ఉదయం నుంచి ఇక్కడకు పర్యాటకులు రావటం ప్రారంభించారు. కొంతమంది వాహనాలపై భోజనాలు తెచ్చుకోగా, మరికొందరు తీరంలోని తోటల్లో వండుకున్నారు. తీరంలో కబడ్డీ, వాలీబాల్ ఆటలాడి సాయంత్రం స్వస్థలాలకు వెళ్లారు.

పూర్వ విద్యార్థుల ఆనందలహరి



కొండకర్ల ఆవలో పడవపై విహరిస్తున్న డిగ్రీ పూర్వ విద్యార్థులు

అచ్యుతాపురం డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు (1990-93 బ్యాచ్) ఆదివారం కొండకర్ల ఆవ వద్ద ఆత్మీయంగా కలుసుకున్నారు. పరస్పరం పలకరింపుల తరువాత కళాశాల రోజుల నాటి స్మృతులను గుర్తు చేసుకుని ఆనందించారు. అనంతరం ఆవలో పడవలపై ప్రయాణించి ఉల్లాసం పంచుకున్నారు.

'సనాతన ధర్మాన్ని కాపాడుకుందాం'



కార్యక్రమంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

రాంబిల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందిరిపై ఉందని రాష్ట్రీయ స్వయంసేవక్‌ప్రాంత కార్యకారిని ఓలేటి సత్యనారాయణ అన్నారు. ఆదివారం రాంబిల్లి రామాలయంలో నిర్వహించిన హైందవ శంఖారావం సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మన ధర్మాన్ని కాపాడుకుంటూనే మనల్ని మనం రక్షించుకోవాలన్నారు. మన దేవాలయాలు, వాటి ఆస్తులను మనమే పోషించుకునేలా సంస్కార కేంద్రాలు కావాలంటూ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. జనవరి 5న విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడ సమీపంలోని గన్నవరంలో జరుగు హైందవ శంఖారావం కార్యక్రమానికి హిందూ భక్తులు అధిక సంఖ్యలో హాజరై మద్దతు పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జోన్ ధర్మప్రచారక్ ఆడాడి గంగాధర్, ఖండ కన్వీనర్ బి.వి.రమణ మాస్టారు, కన్వీనర్లు రాజాన సత్యనారాయణ, సూరాడ నూకరాజు, సీహెచ్ గగన్, కొల్లి అప్పారావు, ఐదు పంచాయతీల పెద్దలు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

రాంబిల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాంబిల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఓ చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఆదివారం రాంబిల్లి సీఐ నరసింగరావు తెలిపారు. ఆయన అందించిన వివరాల మేరకు... రాంబిల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన పెంటకోట నాగేశ్వరరావు ఇంటిలో ఈ నెల 1న 20 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు ఫిర్యాదు అందింది. దర్యాప్తు చేపట్టిన ఈ కేసులో భాగంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఎలమంచిలి పట్టణం ఏఎస్‌ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న పతివాడ గణేష్‌ను అరెస్ట్ చేశామన్నారు. ఇతని వద్ద నుంచి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. గతంలో ఇతనిపై పలు కేసులు నమోదై ఉన్నాయని సీఐ తెలిపారు.

ప్రమాదాల హై వే

... 5వ పేజీ తరువాయి



ప్రమాదాలు జరిగే ఎలమంచిలి మండలం కొక్కిరాపల్లి జంక్షన్.. (ఇన్‌సెట్‌లో) సబ్బవరంలో అత్యధిక రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్ ఏరియా

గుర్తించారు. ఈ ఏడాది జనవరి నుంచి నవంబరు వరకు 42 ప్రమాదాలు సంభవించగా 11 మంది మృతి చెందారు. గత ఏడాది మండల పరిధిలో హైవేపై 66 ప్రమాదాలు జరగ్గా 26 మంది ప్రాణాలు కోల్పోయారని సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు.

ఎస్.రాయవరంలో నాలుగు డేంజర్ స్పాట్‌లు

- 33 ప్రమాదాలు, 16 మంది మృతి

ఎస్.రాయవరం మండలంలో జాతీయ రహదారిపై అడ్డరోడ్డు, గోకులపాడు, పెనుగొల్లు, ధర్మవరం అగ్రహారం ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించినట్టు ఎస్‌ఐ విభీషణరావు తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి నవంబరు వరకు 33 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. 16 మంది మృతిచెందగా, 32 మంది గాయపడ్డారు. అత్యధిక ప్రమాదాలు గోకులపాడు జంక్షన్‌లోనే జరుగుతున్నట్టు పోలీసులు గుర్తించారు.

ఎలమంచిలి పరిధిలో ఐదు బ్లాక్ స్పాట్‌లు

ఎలమంచిలి మండలంలో పేకిళ్లపాలెం జంక్షన్ నుంచి పులపర్తి వరకు హైవేపై ఐదు ప్రదేశాలను పోలీసు, రవాణా శాఖలు, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై నివేదికలు సిద్ధం చేస్తున్నారు. మండలంలో కొక్కిరాపల్లి జంక్షన్, రేగుపాలెం, పోతిరెడ్డిపాలెం, పులపర్తి, లక్కవరం జంక్షన్‌లను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించారు. మండలంలో ఈ ఏడాది జనవరి నుంచి నవంబరు వరకు 13 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 15 మంది మృతిచెందారు. 28 మంది గాయపడ్డారు.

అనకాపల్లి పట్టణ పరిధిలో 52 ప్రమాదాలు

అనకాపల్లి పట్టణ పరిధిలో జలగలమదుం జంక్షన్ నుంచి కొత్తూరు జంక్షన్ వరకు జాతీయ రహదారిపై ఈ ఏడాది ఇప్పటి వరకు 52 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. తొమ్మిది మందిమృతి చెందగా, 52 మంది గాయపడ్డారు. అత్యధికంగా జలగలమదుం జంక్షన్‌లో ముగ్గురు మృత్యువాత పడ్డారు. నూకాంబిక ఆలయ ముఖద్వారం, పూడిమడక జంక్షన్, కొత్తూరు జంక్షన్‌లను ప్రమాదకరంగా పోలీసులు గుర్తించారు.

'సబ్బవరం'లో రెండు బ్లాక్‌స్పాట్‌లు

- 40 ప్రమాదాల్లో 17 మంది మృతి

అనకాపల్లి-ఆనందపురం ఆరు వరుసల జాతీయ రహదారిపై సబ్బవరం మండలంలో తరచూ ప్రమాదాలు జరిగే ఇరువాడ, చిన్నయ్యపాలెం వద్ద బ్లాక్ స్పాట్‌లను గుర్తించారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు ఇరువాడ బ్లాక్‌స్పాట్ ఏరియాలో 22 ప్రమాదాలు సంభవించి 10 మంది మృతిచెందగా, 22 మంది గాయపడ్డారు. చిన్నయ్యపాలెం వద్ద 18 ప్రమాదాలు సంభవించి ఏడుగురు మృతిచెందగా, 18 మంది క్షతగాత్రులయ్యారని సీఐ పిన్నింటి రమణ వెల్లడించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కొరుప్రోలులో 36 ఏళ్ల తర్వాత కలయిక



కొరుప్రోలు పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఎస్.రాయవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1988-89 బ్యాచ్‌లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా ఆదివారం ఒకచోట కలుసుకున్నారు. దాదాపు 36 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారంతా గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అంతేకాకుండా ఆటపాటలతో సరదాగా గడిపారు. అలాగే అందరూ ఒకచోట సమావేశమై ప్రతి ఒక్కరూ ఏయే రంగాల్లో స్థిరపడ్డారనే విషయాన్ని తెలియజేశారు. అలాగే వారి కుటుంబ విషయాలు, ఆర్థి స్థితిగతుల గురించి వివరించుకున్నారు. ఇందులో భాగంగా ఆర్థికంగా వెనుకబడి ఉన్న కుటుంబాలలో పిల్లలకు తమవంతు సహాయసహకారాలు అందించడానికి, వారు చదువుకున్న పాఠశాల అభివృద్ధికి సహకరించాలని నిర్ణయించుకున్నారు. తామంతా ఒకే చోట కలవడానికి కారణమైన ప్రస్తుత పాఠశాల చైర్మన్ బత్తిన సత్తిబాబు, కామరాజు, వెంకటగిరి, కోన అప్పలరాజు కారణమని పూర్వ విద్యార్థులు తెలిపారు. 36 ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థులు కలవడంతో పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది.

బాక్సింగ్ టోర్నమెంట్ ఏపీ కోచ్‌గా అబ్బు



కోచ్ అబ్బు

నర్సీపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో న్యూ ఢిల్లీలో జరిగే అండర్-17 బాక్సింగ్ టోర్నమెంట్‌కు ఆంధ్రప్రదేశ్ టీమ్‌కు కోచ్‌గా అబ్బును ఎంపిక చేసినట్టు ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ నెల 8 నుంచి 15వ తేదీ వరకు న్యూ ఢిల్లీలోని ఇండోర్ స్టేడియంలో బాక్సింగ్ టోర్నమెంట్ జరుగుతుందని చెప్పారు. కోచ్‌గా అబ్బు ఎంపిక కావడం పట్ల నింజాస్ అకాడమీ డైరెక్టర్ వెలగా నారాయణరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

చలో అమరావతిని జయప్రదం చేయాలి

పాయకరావుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా ఈ నెల 19న జరిగే చలో అమరావతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దళిత బహుజన పార్టీ రాష్ట్ర నాయకురాలు దాసరి అన్నపూర్ణ పిలుపునిచ్చారు. స్థానిక డీబీపీ కార్యాలయంలో ఆదివారం చలో అమరావతి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దళితుల భవిష్యత్‌ను దెబ్బతీయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణను చేపట్టాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బడుగు అచ్చారావు, నాయకులు బోడపాటి లక్ష్మి, చిరుకూరి అర్జునరావు పాల్గొన్నారు

బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

ఎలమంచిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులపర్తి జంక్షన్ జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం ద్విచక్రవాహనదారుడిని ఓ ప్రైవేటు బస్సు ఢీకొట్టడంతో పేట బయ్యవరం గ్రామానికి చెందిన మొగిలి సత్యనారాయణ చేతికి తీవ్ర గాయాలైనట్లు రూరల్ పోలీసులు తెలిపారు. సత్యనారాయణ ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతుండగా తుని నుంచి అనకాపల్లి వైపు వస్తున్న బస్సు ఢీకొట్టిందన్నారు. 108 వాహనంలో అనకాపల్లిలోని ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం విశాఖ తరలించినట్టు తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

నక్కపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో కాగిత గ్రామం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదం కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. విశాఖపట్నానికి చెందిన ఓ కుటుంబం ఆదివారం అన్నవరం కారులో బయలుదేరారు.కాగిత గ్రామం దాటాక ఓ ఆవు రోడ్డుపైకి రావడంతో కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆవు కారుపైన పడడంతో ముందు భాగం నుజ్జునుజ్జవగా డ్రైవర్‌కు గాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి తీసుకున్నారు.

మంచు కురిసే వేళలో...



కోటవురట్లలో మంచు తెర నుంచి వస్తున్న ఎడ్ల బండ్లు

కోటవురట్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాల్లో రెండు రోజులుగా దట్టమైన మంచు కురుస్తున్నది. తెల్లవారు నాలుగు గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు మంచు దుప్పటి కమ్ముకుంటున్నది. మంచు తెరల్లో నుంచి ఎడ్ల బండ్లు, లైట్ల వెలుగులో వాహనాలు రావడం చూపరులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. ఆదివారం ఉదయం 9 గంటలైన సూర్యుడు జాడ కనిపించపోవడంతో ఏజెన్సీ వాతావరణాన్ని తలపించింది. అయితే ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంటున్నది. దీంతో వాహనదారులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు.

ఉత్సాహంగా గిరిజన సమ్మేళనం



సాంస్కృతిక ప్రదర్శనలతో గిరిజన యువత

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గీతం ఆసుపత్రి ఆడిటోరియంలో నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ (మై భారత్) ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న 16వ జాతీయ గిరిజన యువ సమ్మేళనం ఉత్సాహంగా సాగుతోంది. ఆదివారం చత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన ఆదివాసీ యువత పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. అనంతరం నిర్వాహకులు జాతి నిర్మాణంలో ఆదివాసీల దేశ భక్తి అన్న అంశంపై డిబేట్ పోటీ నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లా ఎన్‌వీకే అధికారి గొర్లె మహేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్‌వీకే శ్రీకాకుళం జిల్లా అధికారి కె. వెంకట్ ఉజ్వల్, ఏవో పృథ్వీ, అల్లం రామ్ ప్రసాద్, ప్రసన్న శ్వేత, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా మార్టుల్లో బలవంతపు కొనుగోళ్లు

... 5వ పేజీ తరువాయి

ఒక్కొక్కరు ఏడాదికి ఒకేసారి రూ.3 వేల విలువగల సరకులు మార్టులో కొనుగోలు చేయాలని వీవోఏల ద్వారా ఒత్తిడి తీసుకువచ్చారు. సంఘంలో పది మంది సభ్యులు ఉంటే పొదుపు ఖాతాల నుంచి రూ.30 వేలు డ్రా చేయించి, ఆ మేరకు విలువైన సరకులను మార్టులో కొనుగోలు చేసిన తరువాత ఆ రశీదు తీసుకెళ్లి చూపితేనే రుణాలు మంజూరు చేస్తున్నారని డ్వాక్రా సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొదుపు సంఘం నిధులను వ్యక్తిగత అవసరాల కోసం కూడా గత ఐదేళ్ల నుంచి బ్యాంకు సిబ్బంది ఇవ్వడం లేదని, కానీ ఇప్పుడు వెలుగు సిబ్బంది ఆదేశాలతో మార్టులో సరకుల కొనుగోలు కోసం పొదుపు ఖాతాల నుంచి నిధులు విత్ డ్రా చేయిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. మార్టులో బలవంతపు కొనుగోళ్లను నిలుపుదల చేయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కాగా డ్వాక్రా సంఘాల ఆరోపణపై వెలుగు ఏపీఎం మంగను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. సభ్యులకు స్త్రీనిధితో పాటు బ్యాంకు లింకేజీ రుణాలు ఇస్తున్నామని, మార్టులో సరకులు కొనుగోలు చేయాలని ఎవరినీ బలవంతం పెట్టలేదని చెప్పారు. అయితే మహిళా సంఘాల డబ్బులతోనే మార్టు ఏర్పాటు చేసినందున డ్వాక్రా సభ్యులంతా అక్కడే సరకులు కొనుగోలు చేసుకోవాలని, మార్టును అభివృద్ధి చేసుకోవాలని చెబుతున్నామన్నారు.

ఇంకెన్నాళ్లు ఇసుక కష్టాలు!

... 5వ పేజీ తరువాయి

సమాచారం. దీంతో ఇసుక డిపోల ఏర్పాటు విషయంలో అధికారులు ఎటూ తేల్చుకోలేక తలలు పట్టుకుంటున్నారు.

అధిక ధరలకు ఇసుక అమ్మకాలు

జిల్లాలో ఇసుక డిపోల ఏర్పాటులో ఆలస్యం, మరోవైపు పెద్ద మొత్తంలో ఇసుక అవసరమైన భవన నిర్మాణదారులు ఆన్‌లైన్‌లో బుక్ చేయడానికి సర్వర్ మొరాయిస్తుండడం ఇసుకాసురులకు కాసుల పంట పండుతున్నది. ఒకవేళ ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకున్నప్పటికీ రాజమహేంద్రవరం, శ్రీకాకుళం రీచ్‌ల నుంచి సక్రమంగా రవాణా జరగడం లేదు. దీంతో అధిక ధర చెల్లించి ఆయా రీచ్‌ల నుంచి ప్రైవేటు ట్రాన్స్‌పోర్టర్ల ద్వారా నేరుగా ఇసుక రప్పించుకుంటున్నారు. ఇసుక లోడింగ్ అన్‌లోడింగ్, టోల్ ఫీజు, ఇతరత్రా ఖర్చులు కలిపి 20 టన్నుల లారీకి రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు చెల్లించుకోవాల్సి వస్తున్నదని భవన నిర్మాణదారులు అంటున్నారు. ఇక కొద్దిపాటి మొత్తంలో ఇసుక అవసరమైన వారు స్థానికంగా వున్న నదుల్లో అక్రమంగా తవ్వకాలు జరిపేవారి నుంచి కొనుగోలు చేసుకుంటున్నారు. ఐదు టన్నులు వుండే ట్రాక్టర్ ఇసుక రూ.5-6 వేలకు కొనుగోలు చేస్తున్నారు. ఇసుక డిపోల ఏర్పాటులో జరుగుతున్న జాప్యం వల్ల గత వైసీపీ హయాంలో పడిన అవస్థలే పడాల్సి వస్తున్నదని భవన నిర్మాణదారులు అంటున్నారు.

నేడు హౌస్ కమిటీ రాక

విశాఖ డెయిరీలో అక్రమాలపై విచారణ

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీలో అక్రమాలపై విచారణకు నియమించిన హౌస్‌కమిటీ సోమవారం అక్కిరెడ్డిపాలెంలోని డెయిరీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించనుంది. హౌస్ కమిటీ ఛైర్మన్ జ్యోతుల నెహ్రూ, సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు, పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, గౌతు శిరీష, ఆర్‌వీఎస్‌కేకేవీ రంగారావు, దాట్ల సుబ్బరాజు సోమవారం ఉదయం నగరంలోని దసపల్లా హోటల్‌కు చేరుకుని, అక్కడి నుంచి డెయిరీకి వెళ్తారు. డెయిరీ అధికారులతో మాట్లాడిన అనంతరం, రికార్డులు తనిఖీ చేస్తారు. రైతులు, కార్మికుల నుంచి వినతులు స్వీకరించనున్నారు. విశాఖ డెయిరీ మొత్తం ఆడారి తులసీరావు కుటుంబసభ్యుల గుప్పిట్లో ఉండడంతో పాటు అక్రమాలు జరిగాయని ఇటీవల ఫిర్యాదులు వెల్లువెత్తడంతో హౌస్ కమిటీని నియమించిన విషయం తెలిసిందే.

బెల్ట్ షాపులు ప్రోత్సహిస్తే చర్యలు



మద్యం దుకాణాల యజమానులతో సమావేశమైన సీఐ మల్లికార్జునరావు

పరవాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మద్యం బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పరవాడ సీఐ మల్లికార్జునరావు హెచ్చరించారు. ఆదివారం పరవాడ ప్రాంత పరిధిలోని మద్యం దుకాణాల యజమానులతో ఆయన సమావేశమయ్యారు. ప్రభుత్వం రూపొందించిన నిబంధనలను తు.చ.తప్పకుండా పాటించాలన్నారు. బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తూ దొరికితే దుకాణం యజమానిపై కేసు నమోదు చేయడంతో పాటు లైసెన్సు రద్దు చేయడం ఖాయమన్నారు. ప్రతి ఒక్కరూ మద్యం దుకాణాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడంతో పాటు సమయపాలన పాటించాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా వ్యాపారాలు నిర్వహించుకోవాలని సీఐ సూచించారు.

మద్యం సీసాలు స్వాధీనం

కొత్తూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మునగపాక మండలం నాగులాపల్లి గ్రామ సమీపంలో ఉన్న రైస్‌మిల్లు వద్ద అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తున్న మహిళ నుంచి 26 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ వై.ఎల్.నాయుడు ఆదివారం తెలిపారు.

ఆటోడ్రైవర్‌ను బెదిరించిన కేసులో నిందితుడి అరెస్టు

కొత్తూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్‌ను చాకుచూపి బెదిరించిన ఘటనలో నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి ఆదివారం అరెస్టు చేశామని అనకాపల్లి పట్టణ సీఐ టి.వి. విజయ్‌కుమార్ తెలిపారు. నెహ్రూచౌక్ కూడలి సమీపంలో ఉన్న జార్జిక్లబ్ వద్ద శనివారం రాత్రి గవరపాలెం నిదానం దొడ్డి ప్రాంతానికి చెందిన దాడి అరుణ్‌కుమార్ అనే వ్యక్తి నడుస్తున్న ఆటో ఎక్కి ముందుకు పోనివ్వాలని డ్రైవర్‌ను బలవంతం చేశాడన్నారు. దీనిపై ఆటో డ్రైవర్ అప్పన్న గోవింద ఎక్కడికి వెళ్లాలని అడుగగా అరుణ్‌కుమార్ జేబులోంచి చాకు తీసి హత్యాయత్నానికి పాల్పడ్డాడన్నారు. ఎస్ఐ ఈశ్వరరావు దర్యాప్తులో భాగంగా ఆదివారం పూడిమడక రోడ్డు వద్ద నిందితుడ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ చెప్పారు.

ఉన్నత చదువులకు శిక్షణ

దేవరాపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ప్రత్యేక శిక్షణ ఇస్తామని ఉమ్మడి విశాఖ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాల సమన్వయకర్త ఎస్.రూపవతి తెలిపారు. తెనుగుపూడిలో ఆదివారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఐఐటీ, నీట్ కోసం రాష్ట్ర స్థాయి ప్రతిభా పరీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రతిభ సాధించిన విద్యార్థులను ఎంపిక చేసి ఉత్తరాంధ్రకు చెందిన విశాఖ శ్రీకృష్ణాపురం, చీపురుపల్లి గురుకుల విద్యాలయాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు.

అగ్రహారం వీధిలో రోడ్లకు మహర్దశ

» పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం » కూటమి ఏలుబడిలో అభివృద్ధికి శ్రీకారంపట్ల స్థానికుల హర్షం





అగ్రహారం వీధి-2లోరోడ్లు నిర్మించక ముందు ఉన్న పరిస్థితి (మొదటి చిత్రం), కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నిర్మించిన సిమెంటు రోడ్డు (కుడివైపు చిత్రం)

కశింకోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ కశింకోట గ్రామంలో అగ్రహారం వీధి ఒకప్పుడు అధ్వానంగా ఉండేది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేయాలని స్థానికులు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. మురుగుకూపంలో, తీవ్ర దుర్గంధంతో ఉన్న ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం తొలి అడుగు వేసింది. ఏళ్ల తరబడి ఈ ప్రాంతవాసులు ప్రమాదమంచున ఇళ్లకు చేరుకునేవారు. కారు చీకటిలో, దట్టమైన తుప్పలు వ్యాపించి ఉండే ఈ ప్రాంతంలో పాములు సంచరిస్తూ ఉండేవి. అయినా తప్పనిపరిస్థితిలో భయం గుప్పెట్లో ఈ ప్రాంత వాసులు రాకపోకలు సాగించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అగ్రహారం వీధి-2లో 12 అడుగుల రోడ్లు నిర్మించేందుకు రూ.60 లక్షలు మంజూరు చేసింది. ఈ రోడ్ల నిర్మాణానికి ఎంపీ సీఎం రమేష్ శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. అప్పటి నుంచి రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరు చేశారు. తమ రహదారి కష్టాలు ఇంతకాలానికి తీరాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టారు. అయితే వీధి దీపాలు లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. చుట్టూ కలుపుమొక్కలు ఉండడం వల్ల రాత్రి సమయాల్లో పాముల బెడద ఎక్కువైంది. చీకటి పడిన తరువాత బయటకు రావాలంటే వణుకు పుడుతోంది. తక్షణమే వీధి దీపాలు ఏర్పాటు చేసేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్య తీసుకోవాలి.



-చామరౌతు వెంకటలక్ష్మి

వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం నూతన కార్యవర్గం



కొత్తగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు సత్కారం

తుమ్మపాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైతు శిక్షణ కేంద్రంలో ఆదివారం వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుల ఎన్నిక నిర్వహించారు. జిల్లా అధ్యక్షునిగా త్రివిక్రమరావు, కార్యదర్శిగా కేబీ సూర్యనారాయణ, కోశాధికారిగా నారాయణలు ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా రమణ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా చినదేముడు ఎన్నికయ్యారు. సంఘం అభ్యున్నతికి కృషి చేస్తామని కొత్త కార్యవర్గ సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదరి కేవీ సత్యనారాయణ, కోశాధికారి సుబానీ పాల్గొన్నారు.

జాలి చూపొద్దు..మేలు చేయండి



విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో పాల్గొన్న ప్రత్యేకాధికారిణి రోజారాణి

కశింకోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులపై మాటలతో జాలి చూపొద్దని, మేలు చేసి, వారికి సమాజంలో సమానమైన స్థానాన్ని కల్పించాలని మండల ప్రత్యేకాధికారిణి ఎం.రోజారాణి పిలుపునిచ్చారు. మండలంలోని బయ్యవరం గ్రామంలో ఉన్న ఆదర్శ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగింది. మండల ప్రత్యేకాధికారిణి ఎం.రోజారాణి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దివ్యాంగుల మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం సమాజానికి స్ఫూర్తిదాయకమన్నారు. వారి శరీరానికే లోపం గాని, మనసుకు కాదన్నారు. ఈ లోకాన్ని మనసుతో చూస్తూ, మనసుతోనే ఆలోచిస్తారని ఆమె అన్నారు. అనంతరం 300 మంది దివ్యాంగులకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.వెంకటేశ్వరరావు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మేనేజర్ ఎల్.దుర్గాప్రసాద్, విశ్వభారతి కాలేజీ ప్రిన్సిపాల్ గొన్నాబత్తుల నానాజీ తదితరులు పాల్గొన్నారు.

'పారిశుధ్య కార్మికురాలి కుటుంబాన్ని ఆదుకోండి'



సమావేశంలో మాట్లాడుతున్న పారిశుధ్య కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు శివలక్ష్మి

కొత్తూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్.రాయవరం మండలం కొరుప్రోలు ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికురాలు ఏడిద కుమారి (40) కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ పాఠశాలల, కళాశాలల పారిశుధ్య కార్మికుల సంఘం (సీఐటీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.శివలక్ష్మి, జానకీలు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. శుక్రవారం మరుగుదొడ్లను శుభ్రం చేస్తున్న క్రమంలో అకస్మాత్తుగా కుప్పకూలి మృతి చెందారన్నారు. కుమారి కుటుంబానికి ప్రభుత్వం సహాయం అందించి ఆదుకోవాలని కోరారు. కార్మికులకు ఉద్యోగ భద్రత లేకపోవడం, ప్రమాదవశాత్తు మృతి చెందినా బీమా సదుపాయం లేకపోవడంతో అకాల మరణాలు సంభవిస్తే ఆ కుటుంబం రోడ్డున పడుతుందన్నారు. ఇప్పటికే కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి ఆరు నెలల బకాయి జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు, నాయకులు వెంకటలక్ష్మి, లక్ష్మికుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ



విలేకరులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ

కొత్తూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అపరిష్కృతంగా ఉన్న అధ్యాపక, ఉపాధ్యాయుల సమస్యలన్నింటినీ పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంలో ఉపాధ్యాయ, ఉద్యోగుల కృషి ఉందన్నారు. ఏ ప్రభుత్వమైనా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి సంక్షేమం కూడా చూడాల్సిన అవసరం ఉందన్నారు. గత ప్రభుత్వంలో సమస్యలు వినే నాథుడే ఉండేవారుకాదన్నారు. శాసనమండలిలో ప్రస్తావించిన సమస్యలకు కూడా పరిష్కారం లభించలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సమస్యలు వినడంతో పాటు వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని తెలిపారు. ఉపాధ్యాయ, ఉద్యోగ, విశ్రాంతి ఉద్యోగుల బకాయిలన్నీ దశలవారీగా చెల్లించడానికి చర్యలు తీసుకుంటోందన్నారు. గత ప్రభుత్వం కాగితంపై మాత్రమే ప్రకటించిన కరువుభత్యాన్ని ఈ ప్రభుత్వం నగదుగా చెల్లించిందన్నారు. 117 జీవో రద్దు చేయడానికి చర్యలు ప్రారంభించిందన్నారు. పీఆర్‌సీ కమిటీ ఏర్పాటు, ఐఆర్ విడుదల, సిపిఎస్, జిపిఎస్ ఉద్యోగులకు పాత పింఛను విధానం అమలు, నెలవారీ పదోన్నతులు, ప్రభుత్వ, జిల్లా పరిషత్ మున్సిపల్, ఎయిడెడ్ తదితర ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించుకోవలసి ఉందన్నారు. త్వరలో జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లుగా అర్హులందరూ నమోదు అవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికి దుర్గాపసాద్, కార్యదర్శి దేముడుబాబు, పట్టణ శాఖ అధ్యక్షుడు కొణతాల గణేష్, ప్రసాద్, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుంపాల వెంకటరమణ, కార్యదర్శి నక్కా శ్రీనుబాబు, రాష్ట్ర కార్యదర్శి పెనుమత్స కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పురస్కారానికి కృషి చేసిన కార్యదర్శికి సత్కారం



తగరంపూడి పంచాయతీ కార్యదర్శి ఎస్తేరును సత్కరిస్తున్న బీజేపీ నేతలు

కొత్తూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం తగరంపూడి పంచాయతీకి దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారం రావడానికి కృషి చేసిన పంచాయతీ కార్యదర్శి ఎస్తేరును స్థానిక బీజేపీ నేతలు సత్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు కె.తాతారావు, నర్సింగ్‌యాదవ్, కిసాన్ మోర్చ జోనల్ ఇన్‌ఛార్జి గొంతిన భక్తసాయిరాం, నాగమణి, వుడా రమేష్, వి.సంతోష్, ఆడారి సూర్యప్రకాశరావు, నాని ఆమెకు అభినందనలు తెలిపారు.

'హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలి'



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

పరవాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వచ్చే నెల 5న విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ పరవాడ మండల ధర్మ ప్రచారక్ వెన్నెల అప్పలనాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు శంఖారావానికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం రావాడలోని సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ దేవాలయాలపై దాడులు జరగకుండా వాటి రక్షణ కోసం ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వివరించారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాలను నేటితరానికి తెలియజేయాలన్న ఉద్దేశంతోనే హైందవ శంఖారావం సభను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు నాగమణి, అప్పలనర్స లక్ష్మి, రమణమ్మ, రత్నం, దేవుడమ్మ, రాము, పవన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలి



మహాసభల సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

తుమ్మపాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సీనియర్ న్యాయవాది పిళ్లా హరశ్రీనివాసరావు కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర మహాసభల సావనీర్‌ను ఆదివారం ఏపీటీఎఫ్ భవన్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సామ్రాజ్యవాదుల కబంధ హస్తాల నుంచి వ్యవసాయ రంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ రంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న హామీలను తక్షణమే నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకుల కోన మోహనరావు, పైల రమేశ్, గొర్లి రాజు, అప్పలనాయుడు, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

'జంగమ కుటుంబాలకు ప్రభుత్వ చేయూత అవసరం'

నాగలింగంను సత్కరిస్తున్న జంగమ సంఘం ప్రతినిధులు



తుమ్మపాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెనుకబడిన జంగమ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని జంగమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పలపాటి మారుతీనాగలింగం డిమాండ్ చేశారు. ఆదివారం బొజ్జన్నకొండ వద్ద రెవెన్యూ డివిజన్ పరిధిలోని జంగమ కుటుంబాలతో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. జంగమ కుటుంబాల్లో చాలా మంది ఆర్థికంగా వెనుకబడి ఉన్నారన్నారు. ప్రభుత్వం అలాంటి వారికి సహకారం అందించాలన్నారు. పలు రంగాల్లో ప్రోత్సాహాలు అందించి అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా నాగలింగంను జంగమ కుటుంబ సభ్యులు సత్కరించారు. అనంతరం బొజ్జన్నకొండ వద్ద ఆటపాటలతో సందడి చేశారు. సంఘం నాయకులు నందికాశి, పూడి ఈశ్వరరావు, అత్తిలి ఈశ్వరరావు, లోకనాథం, రఘురాం, వసంతరావు, మల్లెబాబు, రమణమూర్తి, మహేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

పరవాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారంలో భాగంగా గ్రామాల వారీగా సోమవారం నుంచి ఈ నెల 31 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎస్‌వీఅంబేడ్కర్ తెలిపారు. సోమవారం (9న) భరిణికం, 10న తానాం, 11న వెన్నెలపాలెం, 12న చీపురుపల్లి వెస్ట్, 13న చీపురుపల్లి ఈస్ట్, 16న మంత్రిపాలెం, 17న రావాడ, 18న పెదముషిడివాడ, 19న ఇ- మర్రిపాలెం, 20న కన్నూరు, 21న తాడి, 23న లంకెలపాలెం, 24న దేశపాత్రునిపాలెం, 26న పి-బోనంగి, 27న కలపాక, 28న ఈ-బోనంగి, 30న స్వయంభూవరం, 31న పరవాడలో సదస్సులు జరుగుతాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు.

సబ్బవరంలో జనవరి 8 వరకు...

సబ్బవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సబ్బవరం మండలంలో ఈ నెల 9 నుంచి జనవరి 8 వరకూ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తహసీల్దార్ బి చిన్నికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, భోజన విరామానంతరం 2 నుంచి 5 గంటల వరకూ జరిగే సదస్సుల్లో భూములకు సంబంధించిన అన్ని రకాల సమస్యలకు అర్జీలు స్వీకరిస్తామన్నారు. అక్కడికక్కడే సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. 9న అయ్యన్నపాలెం, 10న వంగలి, 11న ఎల్లుప్పి, 12న ఆర్బీఅగ్రహారం, 13న బంగారమ్మపాలెం, 16న నంగినారపాడు, 17న టెక్కలిపాలెం, 18న అంతకాపల్లి, 19న అజనగిరి, 20న గంగవరం, 21న నల్లరేగులపాలెం, 23న బాటజంగాలపాలెం, 24న వెదుళ్లనరవ, 26న అమృతపురం, 27న గొల్లలపాలెం, 28న చింతగట్ల అగ్రహారం, 30న గుల్లేపల్లి, మొగలిపురం, 31న లగిశెట్టిపాలెం, జనవరి 2న ఆరిపాక, 3న అసకపల్లి, 4న గొటివాడ, 6న పైడివాడ, 7న సబ్బవరం, 8న పైడివాడ అగ్రహారం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు.

దేవీపురంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



సబ్బవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవీపురంలో రాంపురం జిల్లా పరిషత్తు హైస్కూల్ 1988-89 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఆదివారం వైభవంగా జరిగింది. ఈసందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, కుటుంబ వివరాలు తెలుసుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలు, చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు. రోజంతా ఆట పాటలతో గడిపారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. ఏటా కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఆనాటి క్లాస్ లీడర్ శ్రీను ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బాదిరెడ్డి లక్ష్మణ, సత్యనారాయణ, కనకరాజు, సమతా, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

శివాలయం పునర్నిర్మాణానికి విరాళం



సబ్బవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పురాతన శివాలయం పునర్నిర్మాణానికి స్థానిక కోమటి వీధికి చెందిన పురోహితులు స్వయంపాకల వెంకటనారాయణ ఆదివారం రూ.10,116 విరాళం అందజేశారు. ఆయనకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు దెంగేటి నానీబాబు, బర్ల రమణ, గెడ్డం కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామ దేవతల ఆలయ జీర్ణోద్ధరణ పనులకు శంకుస్థాపన



కార్యక్రమంలో పాల్గొన్న సీఐ పిన్నింటి రమణ తదితరులు

సబ్బవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం జోడుగుళ్ల వద్ద బంగారమ్మ, కుంచాలమ్మ, మంచాలమ్మ గ్రామ దేవతల ఆలయ పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఐ పిన్నింటి రమణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన కొబ్బరికాయ కొట్టి పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇలాంటి దైవ కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు, బలిరెడ్డి అప్పారావు, రోమాల చంద్రశేఖర్, మాజీ సర్పంచ్‌లు మండల సముద్రం, ధనిమిరెడ్డి శ్రీను, న్యాయవాది బేతిన శ్రీనివాసరావు, పల్ల తాతారావు, శింగంపల్లి వెంకటరావు, పలువురు గ్రామ పెద్దలు, జోడుగుళ్ల మహిళలు పాల్గొన్నారు.

పెందుర్తి నియోజకవర్గంలో సాగునీటి సాంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు

సబ్బవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. పెందుర్తి నియోజకవర్గంలోని సబ్బవరంలో 23, పరవాడ 2, పెందుర్తిలో 13 మైనర్ సాగునీటి చెరువులకు ఎన్నికలు నిర్వహిస్తారు. మొత్తం 15,089 మంది పురుషులు, 4481 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. కలెక్టర్ సాగునీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తారని సబ్బవరం, పరవాడ సాగునీటి శాఖ జేఈ ఎస్.సాయికిరణ్ తెలిపారు. 14న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పోలింగ్, 3 నుంచి 5 గంటల వరకూ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు జరుగుతాయన్నారు. 12, 13 తేదీల్లో వీఆర్వో సహాయంతో ఎన్నికల అధికారి గ్రామాల్లో ప్రచారం(టాంటాం) వేస్తారని తెలిపారు. నియోజకవర్గంలో 100 ఎకరాలు ఆయకట్టు పైబడిన సాగునీటి చెరువుల (మైనర్)కు ఎన్నికలు నిర్వహించేందుకు ఇరిగేషన్, రెవెన్యూ శాఖల సన్నాహాలు పూర్తి చేశాయి. ఒక్కో చెరువు కింద ఉన్న ఆయకట్టును 6 టెరిటోరియల్ ప్రాదేశిక నియోజకవర్గాలుగా విభజించారు. ఒక్కో ప్రాదేశికానికి ఒక డైరెక్టర్‌ను ఓటర్లు (రైతులు) ఎన్నుకుంటారు. ఆరుగురు డైరెక్టర్లలో ఒకరిని అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు. మిగతా నలుగురు డైరెక్టర్లుగా ఉంటారు. ఓటు వేసే రైతుకు భూమి పాస్ పుస్తకం కానీ, రెవెన్యూ అధికారులు ఇచ్చిన గుర్తింపు పత్రం(ఆండంగల్) కానీ తప్పనిసరిగా ఉండాలని సాయికిరణ్ తెలిపారు.

వరి నూర్పు యంత్రంలో పడి రైతుకు గాయాలు



నుజ్జయిన కాలు

పెద బయలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు వరి నూర్పు యంత్రంలో రైతు పడడంతో ఆయన కాలికి తీ వ్రగాయాలయ్యాయి. వివరాలివి.. గంపరాయి పంచాయితీ కాగుల గ్రామంలో ఆదివారం నూకరాజు వరి యంత్రం ద్వారా వరి నూర్పు చేపడుతున్నారు. ఆయన సహాయంగా పనిలోకి వచ్చిన గొల్లోరి నాగేశ్వరరావు నూర్పు చేస్తుండగా యంత్రంలోకి కుడికాలు వెళ్లి నుజ్జునుజ్జయింది. దీంతో అతనిని స్థానికులు హుటాహుటీన పాడేరు సర్వజన ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించారు. పని కోసం వెళ్లి నాగేశ్వరరావు కాలు తెగిపోవడంతో ఆయన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నారవుతున్నారు. నాగేశ్వరరావుకు భార్య,ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు స్పందన



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో ప్రసాద్, చీఫ్ కొండలరావు

చింతపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ పరీక్షను విద్యాశాఖ అధికారులు నిర్వహించారు. వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు 103మంది హాజరయ్యారు. ఈసందర్భంగా ఎంఈవో పీబీవీవీ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష రాసి ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఎనిమిదో తరగతి విద్యార్థులకు తొమ్మిది, పది, ఇంటర్ వరకు ఏడాదికి రూ.12వేల ఉపకారవేతనం అందజేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పరీక్ష చీఫ్ జేఏ కొండలరావు, డీవో గడుతూరి కృష్ణ పాల్గొన్నారు.

మహిళా మార్టుల్లో బలవంతపు కొనుగోళ్లు

... 5వ పేజీ తరువాయి

ఒక్కొక్కరు ఏడాదికి ఒకేసారి రూ.3 వేల విలువగల సరకులు మార్టులో కోనుగోలు చేయాలని వీవోఏల ద్వారా ఒత్తిడి తీసుకు వచ్చారు. సంఘంలో పది మంది సభ్యులు ఉంటే పొదుపు ఖాతాల నుంచి రూ.30 వేలు డ్రా చేయించి, ఆ మేరకు విలువైన సరకులను మార్టులో కోనుగోలు చేసిన తరువాత ఆ రశీదు తీసుకెళ్లి చూపితేనే రుణాలు మంజూరు చేస్తున్నారని డ్వాక్రా సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొదుపు సంఘం నిధులను వ్యక్తిగత అవసరాల కోసం కూడా గత ఐదేళ్ల నుంచి బ్యాంకు సిబ్బంది ఇవ్వడం లేదని, కానీ ఇప్పుడు వెలుగు సిబ్బంది అదేశాలతో మార్టులో సరకుల కొనుగోలు కోసం పొదుపు ఖాతాల నుంచి నిధులు విత్ డ్రా చేయిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. మార్టులో బలవంతపు కొనుగోళ్లను నిలుపుదల చేయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కాగా డ్వాక్రా సంఘాల ఆరోపణపై వెలుగు ఏపీఎం మంగను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. సభ్యులకు స్త్రీనిధితో పాటు బ్యాంకు లింకేజీ రుణాలు ఇస్తున్నామని, మార్టులో సరకులు కోనుగోలు చేయాలని ఎవరినీ బలవంతం పెట్టలేదని చెప్పారు. అయితే మహిళా సంఘాల డబ్బులతోనే మార్టు ఏర్పాటు చేసినందున డ్వాక్రా సభ్యులంతా అక్కడే సరకులు కోనుగోలు చేసుకోవాలని, మార్టును అభివృద్ధి చేసుకోవాలని చెబుతున్నామన్నారు.



తాటిగుడ జలపాతం వెళ్లేమార్గంలో ఐరెన్ డస్ట్‌బీన్ ఏర్పాటు (ఫైల్‌ఫొటో)



అనంతగిరి రోడ్డును అనుకుని శుభ్రపరుస్తున్న పారిశుధ్య కార్మికులు

పర్యాటక ప్రాంతాల్లో స్వచ్ఛత మెరుగులు

- బొర్రా, కటిక, తాడిగుడ తదితర ప్రాంతాల్లో చెత్తాచెదారాలు తొలగింపు
- ప్లాస్టిక్ నిషేధం అమలు
- పర్యాటకులకు అవగాహన కార్యక్రమాలు

అనంతగిరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మన్యంలో ఎటుచూసినా వృక్ష సంపద, ఎత్తైన పర్వతాలు, పచ్చనిపొలాలు, అందమైన జలపాతాలతో ఆహ్లాదకరమైన వాతావరణం దర్శనమిస్తోంది. వీటిని తిలకించేందుకు దేశవిదేశాలతో పాటుగా రెండు తెలుగు రాష్ట్రాలనుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో రైలు, రోడ్డుమార్గం ద్వారా వస్తుంటారు. అయితే, పర్యాటక ప్రాంతాలు చెత్తాచెదారాలు, ఇతర వ్యర్థాలు కనిపిస్తే వీరి ఆనందానికి అవరోధంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రకృతికి విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేశ్‌కుమార్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు.పర్యాటక సీజన్ ప్రారంభానికి ముందుగానే.. ఆయా ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించారు.. పర్యాటక ప్రాంతాల్లో చెత్తాచెదారాలు తొలగించాలని ఆదేశించారు. ప్లాస్టిక్ నిషేధానికి కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మండలంలో పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్నారు.

ప్రకృతి అందాలకు పర్యాటకులు ఫిదా...

మన్యంలోని సహజసిద్ధంగా ఏర్పడిన అందాలకు పర్యాటకులు ఫిదా అవుతుంటారు. అయితే, పారిశుధ్య లోపంతో వారు నిరాశతో వెనుదిరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పర్యాటకులు మరింత ఆనందంగా గడిపేందుకు మండల స్థాయి అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. చెత్తాచెదారాలతో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను ప్రస్తుతం కళకళలాడే తీర్చిదిద్దుతున్నారు. అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చే బొర్రాగుహల వద్ద మరింత పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. పర్యాటకులు తినిపడేసిన తినుబండరాళ్ల ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిల్స్ తదితర ప్లాస్టిక్ వస్తువులతో గతంలోని అధ్వానంగా ఉండేది. ఇప్పుడు పారిశుధ్య కార్మికులతో చెత్తాచెదారాలు లేకుండా ప్రత్యేకంగా చర్యలు చేపట్టారు.

అదనంగా పారిశుధ్య కార్మికుల ఏర్పాటు

బొర్రాగుహలు, కటికి, తాటిగుడ, సరియా, డముకు వ్యూపాయింట్ తదితర సందర్శిత ప్రాంతాల్లో ఆయా పంచాయతీల పరిధిలోని.. నవంబరు, డిసెంబరు, జనవరి మూడు నెలల పాటుగా అదనంగా పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసి, చెత్తచెదారం లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నారు..

ఐరన్ డస్ట్‌బీన్లు పంపిణీ

ప్రముఖ పర్యాటక ప్రాంతాల వద్ద ప్లాస్టిక్‌వి కాకుండా ఐరన్‌తో తయారుచేసిన డస్ట్‌బీన్లను పంచాయతీల నుంచి పంపిణీ చేశారు. కలెక్టర్ దినేశ్‌కుమార్, డీఎల్‌పీవో కుమార్ ప్రత్యేక చొరవతో వీటి ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. సందర్శకుల తాకిడి బట్టి,ఆయా ప్రాంతాల్లో డస్ట్‌బిన్లను ఏర్పాటు చేశారు.

పక్కాగా ప్లాస్టిక్ నిషేధం



ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు.. పర్యాటక ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తచెదారం తొలగించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ఈనెల ఒకటో తేదీనుంచి ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా అమలుచేస్తున్నాం.. వ్యాపారులు, పర్యాటకులు సహకరించాలి. ప్రకృతి అందాలను కాపాడాలి.

– పీవీవీ కుమార్, ఎంపీడీవో, అనంతగిరి

ఉత్సాహంగా గిరిజన సమ్మేళనం



సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించిన గిరిజన యువత

ఎండాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గీతం ఆసుపత్రి ఆడిటోరియంలో నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ (మై భారత్) ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న 16వ జాతీయ గిరిజన యువ సమ్మేళనం ఉత్సాహంగా సాగుతోంది. ఆదివారం చత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన ఆదివాసీ యువత పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. అనంతరం నిర్వాహకులు జాతి నిర్మాణంలో ఆదివాసీల దేశ భక్తి అన్న అంశంపై డిబేట్ పోటీ నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లా ఎన్‌వీకే అధికారి గొర్లె మహేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్‌వీకే శ్రీకాకుళం జిల్లా అధికారి కె. వెంకట్ ఉజ్వల్, ఏవో పృథ్వీ, అల్లం రామ్ ప్రసాద్, ప్రసన్న శ్వేత, జేమ్స్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి జలపాతం వద్ద పార్కింగ్ సదుపాయం



పార్కింగ్ ఏరియాలో నిలిపిన వాహనాలు

జి.మాడుగుల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ కొత్తపల్లి జలపాతంలో పార్కింగ్ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. రూ.1.50కోట్లతో జలపాతంలో చుట్టూ వాల్స్, సీసీ రోడ్డు నిర్మాణాలను పంచాయతీరాజ్ ఇంజినీర్ శాఖ ద్వారా చేపట్టారు. పార్కింగ్ పనులను యుద్ధ ప్రాతిపదిక పూర్తి చేసి ఆదివారం నాటికి అందుబాటులోకి తెచ్చారు. దీంతో జలపాతం సందర్శనకు వచ్చిన పర్యాటకుల వాహనాలకు పార్కింగ్ కష్టాలు తీరాయి.

గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



బోరు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య, సర్పంచ్

చింతపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి బోర్లు నిర్మిస్తున్నట్టు స్థానిక జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య తెలిపారు. ఆదివారం జడ్పీ నిధులతో గొందిపాకలు గ్రామ పంచాయతీలో బోరు నిర్మాణానికి జడ్పీటీసీ స్థానిక సర్పంచ్ సాగిన వరలక్ష్మితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల తాగు నీటి సదుపాయం కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బూసరి కృష్ణ, గ్రామ పెద్దలు శశికాంత్, తిరుణ్, మధు, సింహాచలం, అప్పలనాయుడు, రూపకాంత్ పాల్గొన్నారు.

గంజాయి జోలికి పోవద్దు

- పర్యాటకుల అవగాహన కార్యక్రమంలో ఎస్పీ అమిత్ బర్దార్



వంజంగిలో అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ, డీఎస్పీ, సీఐ తదితరులు

పాడేరురూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు వచ్చిన పర్యాటకులు గంజాయి జోలికి పోవద్దని ఎస్పీ అమిత్ బర్దార్ సూచించారు. మండలంలో ప్రముఖ పర్యాటక కేంద్రం వంజంగి మేఘాల కొండపై ఆదివారం పర్యాటకులకు డ్రగ్స్ వినియోగంతో వచ్చే నష్టాలపై నిర్వహించిన అవగాహన మారథన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా డ్రగ్స్ వినియోగంతో వచ్చే అనర్థాలను పర్యాటకులకు వివరించారు. కొంత మంది పర్యాటకుల ముసుగులో గంజాయి రవాణాకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ఈ అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. గంజాయి సేవించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రమోద్, సీఐ డి.జీనబంధు, ఎస్ఐ సూర్యనారాయణ, పోలీస్ సిబ్బంది, పర్యాటక యువత పాల్గొన్నారు.

మేఘాల పర్వతం సందర్శన

వంజంగిలో ఆదివారం ఉదయం డ్రగ్స్‌పై పర్యాటకులలో అవగాహన పెంచేందు ందుకు మారథన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎస్పీ అనంతరం "మేఘాల పర్వతం పైకి సిబ్బందితో కలిసి వెళ్లి మంచు అందాలను తిలకించారు. ఈ పర్యటనలో డీఎస్పీ ప్రమోద్, సీఐ దీనబంధు, ఎస్ఐ సూర్యనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జి.మాడుగులలో వర్షం

జి.మాడుగుల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆదివారం సాయంత్రం పలు చోట్ల తేలికపాటి జల్లులు కురిసింది. ఉదయం నుంచి ఎండ కాసి, ఆపై మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా వాతావరణం మార్పులు చోటు చేసుకుంది. కొద్ది క్షణాల్లో ఏకంగా వర్షం పడడంతో రైతులు దిగాలు చెందారు. వర్షంతో రాజ్‌మా సేకరణ పనుల్లో ఉన్న రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇంకెన్నాళ్లు ఇసుక కష్టాలు!

... 5వ పేజీ తరువాయి

సమాచారం. దీంతో ఇసుక డిపోల ఏర్పాటు విషయంలో అధికారులు ఎటూ తేల్చుకోలేక తలలు పట్టుకుంటున్నారు.

అధిక ధరలకు ఇసుక అమ్మకాలు

జిల్లాలో ఇసుక డిపోల ఏర్పాటులో ఆలస్యం, మరోవైపు పెద్ద మొత్తంలో ఇసుక అవసరమైన భవన నిర్మాణదారులు ఆన్‌లైన్‌లో బుక్ చేయడానికి సర్వర్ మొరాయిస్తుండడం ఇసుకాసురులకు కాసుల పంట పండుతున్నది. ఒకవేళ ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకున్నప్పటికీ రాజమహేంద్రవరం, శ్రీకాకుళం రీచ్‌ల నుంచి సక్రమంగా రవాణా జరగడం లేదు. దీంతో అధిక ధర చెల్లించి ఆయా రీచ్‌ల నుంచి ప్రైవేటు ట్రాన్స్‌పోర్టర్ల ద్వారా నేరుగా ఇసుక రప్పించుకుంటున్నారు. ఇసుక లోడింగ్ అన్‌లోడింగ్, టోల్ ఫీజు, ఇతరత్రా ఖర్చులు కలిపి 20 టన్నుల లారీకి రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు చెల్లించుకోవాల్సి వస్తున్నదని భవన నిర్మాణదారులు అంటున్నారు. ఇక కొద్దిపాటి మొత్తంలో ఇసుక అవసరమైన వారు స్థానికంగా వున్న నదుల్లో అక్రమంగా తవ్వకాలు జరిపేవారి నుంచి కొనుగోలు చేసుకుంటున్నారు. ఐదు టన్నులు వుండే ట్రాక్టర్ ఇసుక రూ.5-6 వేలకు కొనుగోలు చేస్తున్నారు. ఇసుక డిపోల ఏర్పాటులో జరుగుతున్న జాప్యం వల్ల గత వైసీపీ హయాంలో పడిన అవస్థలే పడాల్సి వస్తున్నదని భవన నిర్మాణదారులు అంటున్నారు.

కాకరపాడు- కొయ్యూరు రోడ్డుకు మోక్షం

- రూ. 15 లక్షల నిధులు విడుదలు చేసిన ప్రభుత్వం



విస్తరణకు నోచుకోనున్న కాకరపాడు- కొయ్యూరు రహదారి

కొయ్యూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకరపాడు- కొయ్యూరు ప్రధాన రహదారి విస్తరణకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ మార్గ మధ్యలోని రెండు వంతెనలకు రోడ్లు భవనాల శాఖ రూ. 12 లక్షల మేర నిధులను ప్రత్యేకంగా కేటాయించింది. దీంతో నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణతోపాటు మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈ రహదారి పొడవునా అంచులు కోతకు గురవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డు విస్తరణపై గత ప్రభుత్వ హయాంలో ప్రజా ప్రతినిధులు ఇచ్చిన హామీలు నీటిమూటలుగానే మిగిలాయి. రహదారి మధ్య గల రెండు కొండవాగులపై వంతెనల నిర్మాణాలకు నాటి ప్రతిపాదనలతో సరిపుచ్చడంతో మండల కేంద్రానికి వెళ్లాలంటే ఈ మార్గంలో వాహనచోదకులు మృత్యు కుహరం దాటే పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో ఈ రహదారికి రూ.లక్షలు వెచ్చించి మరమ్మతుల్లో భాగంగా గోతులు కప్పి పైన బీటీ రోడ్డు పూర్తి చేశారు. ఈ పనుల్లో నాణ్యత కొరవడడంతో నిర్మించిన ఏడాదికే యథాతథ స్థితికి చేరింది. అప్పట్లో కాకరపాడు సమీప కొండవాగు, శింగవరం ఐటీడీఏ కాలనీ వద్ద వట్టిగెడ్డపై గల కాజ్‌వే స్థానాలలో వంతెన నిర్మాణాలకు ప్రజలనుంచి వచ్చిన అనేక వినతుల మేరకు పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి చొరవతో ఆర్‌అండ్‌బీ అధికారులు రూ. 2.20 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అయితే, నిధులు మంజూరుకాలేదు. కొయ్యూరు వరకు ఈ రహదారిని 30 అడుగుల మేర విస్తరిస్తామని ప్రకటించిన హామీ అమలు కాలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రహదారి పొడవునా ఇరువైపులా అంచుల్లో గోతుల పడి అధ్వానంగా మారింది. చిన్నపాటి వర్షం కురిసినా రెండు కొడవాగుల ప్రవాహాల వరదనీటి ఉధృతికి మండల కేంద్రానికి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఈ విషయాలపై గత జూలైలో 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు రావడంతో అధికారులు, పాలకులు స్పందించారు. ముందుగా రహదారి విస్తరణకు వీలుగా రూ. 12 లక్షలు కేటాయించారు. దీంతో విస్తరణ పనులు కొయ్యూరుకు చెందిన అనిశెట్టి రమణయ్య అనే కాంట్రాక్టరుకు అప్పగించారు. దీంతో రానున్న రెండు రోజులలో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఎట్టకేలకు రహదారి విస్తరణకు మోక్షం కలగడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రగ్గులు పంపిణీ



రగ్గులు పంపిణీ చేస్తున్న దృశ్యం

అనంతగిరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిగుడ గ్రామంలోని 35 మంది నిరుపేదలకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని ఆదివారం రగ్గులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ గొంప వెంకటరావు మాట్లాడుతూ.. గిరిజనులకు సాయం చేయడం ఆనందం ఉందని, ఇప్పటికే మండలంలోని అనేక గిరిజన గ్రామాల్లో తమ ట్రస్ట్ తరుపున విద్య, వైద్యం, పేదలకు వస్త్రాలు పంపిణీ తదితర పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలోని అచ్చిబాబు, ఎరుకునాయుడు, సత్యనారాయణ, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ ఉద్యోగులకు కనీస వేతనం చెల్లించాలి: ఏఐటీయూసీ



జీసీసీ పెట్రోల్ బంక్ ఎదుట ఆందోళన చేస్తున్న ఉద్యోగులు, ఏఐటీయూసీ నాయకులు

చింతపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థ, ఐటీడీఏ పెట్రోల్ బంక్‌ల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అమర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక జీసీసీ పెట్రోల్ బంక్ వద్ద ఉద్యోగులతో కలిసి ఏఐటీయూసీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా అమర్ మాట్లాడుతూ జీసీసీ పెట్రోల్ బంక్ పరిధిలో ఉద్యోగులు మోదమాంబ మ్యాన్ పవర్ ఏజెన్సీ పరిధిలో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారన్నారు. వీరికి కనీస వేతనం, పీఎఫ్, జీతంతో కూడిన నాలుగు రోజుల సెలవు దినాలు, ఎనిమిది గంటల పని కాలం వర్తింప జేయడంలేదన్నారు. వెంటనే ఐటీడీఏ, జీసీసీ ఉన్నతాధికారులు స్పందించి ఈ కార్మికులను సంస్థ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. పీఎఫ్, ఎనిమిది గంట పని కాలం, సెలవులు మంజూరు చేయాలన్నారు. ఐటీడీఏ, జీసీసీ యాజమాన్యం స్పందించక పోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు శివశంకర్, కంకిపాటి సత్తిబాబు, చింతపల్లి మండల నాయకులు లోవరాజు, మత్స్యరాజు, గంగరాజు, రవి, నాని, నిర్మాళ, శేకర్, సువార్త, రాణి పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం



మోదకొండమ్మను దర్శించుకుంటున్న భక్తులు

పాడేరురూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర వాసుల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులు, అయ్యప్ప, శివ మాలధారులతో పాటు పర్యాటకులతో కిటకిటలాడింది. మన్యంలోని వివిధ ప్రాంతాల భక్తులతో పాటు మైదాన ప్రాంతానికి చెందిన వందలాది మంది అమ్మవారి దర్శనానికి వచ్చారు. మైదాన ప్రాంతానికి చెందిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టి ఘటాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వంటలు చేసుకొని బంధు మిత్రులతో కలిసి భోజనాలు చేశారు. అలాగే, అయ్యప్ప, శివ మాలధారులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు, ఆలయ కమిటీ ప్రతినిధులు దన్నేటివలాని రాము, రమణ, చల్ల రామకృష్ణ, కొణతాల సతీష్‌కొమ్మోజి వెంకటరమణ, కె.చంద్రమోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పాడేరు ఘాట్‌లోని మోదాపల్లి జంక్షన్ వద్ద గల అమ్మవారి పాదాల వద్దకు మైదాన ప్రాంతానికి చెందిన వందలాది మంది భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

అన్నసమారాధనకు పెరుగుతున్న భక్తులు

మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం నిర్వహించిన అన్నప్రసాద కార్యక్రమంలో సుమారు 600 మంది భక్తులు ప్రసాదాన్ని స్వీకరించినట్టు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు తెలిపారు. వారంలో ఆది, మంగళ, శుక్రవారం మూడు రోజు లు నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి భక్తుల సంఖ్య పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు, ఆలయ కమిటీ సభ్యులు బి.వెంకటరమణ, కె.చంద్రమోహన్‌కుమార్, టి.ఈశ్వరరావు, డి.రాము, హరిబాబు, దేముళ్ళ, ఎస్.శ్రీనివాస్ కుమార్, ఎస్.కొండలరావు, చిన్ని, దిలీప్, కె.శేఖర్‌బాబు నాయుడు, బీవీఎస్. ముకుందరావు, నానాజీ, సూర్యప్రకాశ్, రత్నాబాయి పాల్గొన్నారు

ప్రమాదాల హై వే

... 5వ పేజీ తరువాయి





ప్రమాదాలు జరిగే ఎలమంచిలి మండలం కొక్కిరాపల్లి జంక్షన్.. (ఇన్‌సెట్‌లో) సబ్బవరంలో అత్యధిక రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్ ఏరియా

గుర్తించారు. ఈ ఏడాది జనవరి నుంచి నవంబరు వరకు 42 ప్రమాదాలు సంభవించగా 11 మంది మృతి చెందారు. గత ఏడాది మండల పరిధిలో హైవేపై 66 ప్రమాదాలు జర్గగా 26 మంది ప్రాణాలు కోల్పోయారని సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు.

ఎస్.రాయవరంలో నాలుగు డేంజర్ స్పాట్‌లు

- 33 ప్రమాదాలు, 16 మంది మృతి

ఎస్.రాయవరం మండలంలో జాతీయ రహదారిపై అడ్డరోడ్డు, గోకులపాడు, పెనుగొల్లు, ధర్మవరం అగ్రహారం ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించినట్టు ఎస్ఐ విభీషణ రావు తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి నవంబరు వరకు 33 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. 16 మంది మృతిచెందగా, 32 మంది గాయపడ్డారు. అత్యధిక ప్రమాదాలు గోకులపాడు జంక్షన్‌లోనే జరుగుతున్నట్టు పోలీసులు గుర్తించారు.

ఎలమంచిలి పరిధిలో ఐదు బ్లాక్ స్పాట్‌లు

ఎలమంచిలి మండలంలో షేక్‌ల్లపాలెం జంక్షన్ నుంచి పులపర్తి వరకు హైవేపై ఐదు ప్రదేశాలను పోలీసు, రవాణా శాఖలు, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై నివేదికలు సిద్ధం చేస్తున్నారు. మండలంలో కొక్కిరాపల్లి జంక్షన్, రేగుపాలెం, పోతిరెడ్డిపాలెం, పులపర్తి, లక్కవరం జంక్షన్‌లను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించారు. మండలంలో ఈ ఏడాది జనవరి నుంచి నవంబరు వరకు 13 రోడ్డు ప్రమాదాలు జర్గగా 15 మంది మృతిచెందారు. 28 మంది గాయపడ్డారు.

అనకాపల్లి పట్టణ పరిధిలో 52 ప్రమాదాలు

అనకాపల్లి పట్టణ పరిధిలో జలగలమదుం జంక్షన్ నుంచి కొత్తూరు జంక్షన్ వరకు జాతీయ రహదారిపై ఈ ఏడాది ఇప్పటి వరకు 52 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. తొమ్మిది మందిమృతి చెందగా, 52 మంది గాయపడ్డారు. అత్యధికంగా జలగలమదుం జంక్షన్‌లో ముగ్గురు మృత్యువాత పడ్డారు. నూకాంబిక ఆలయ ముఖద్వారం, పూడిమడక జంక్షన్, కొత్తూరు జంక్షన్‌లను ప్రమాదకరంగా పోలీసులు గుర్తించారు.

'సబ్బవరం'లో రెండు బ్లాక్‌స్పాట్‌లు

- 40 ప్రమాదాల్లో 17 మంది మృతి

అనకాపల్లి-ఆనందపురం ఆరు వరుసల జాతీయ రహదారిపై సబ్బవరం మండలంలో తరచూ ప్రమాదాలు జరిగే ఇరువాడ, చిన్నయ్యపాలెం వద్ద బ్లాక్ స్పాట్‌లను గుర్తించారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు ఇరువాడ బ్లాక్‌స్పాట్ ఏరియాలో 22 ప్రమాదాలు సంభవించి 10 మంది మృతిచెందగా, 22 మంది గాయపడ్డారు. చిన్నయ్యపాలెం వద్ద 18 ప్రమాదాలు సంభవించి ఏడుగురు మృతిచెందగా, 18 మంది క్షతగాత్రుల య్యారని సీఐ పిన్నింటి రమణ వెల్లడించారు.

కొట్నాబిల్లి రింగ్ రోడ్డుకు మోక్షం

» కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పనులు పునఃప్రారంభం
» ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు చొరవతో చురుగ్గా నిర్మాణం
» త్వరలో గిరిజన గ్రామాలకు తీరనున్న రవాణా కష్టాలు

రావికమతం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా నిలిచిపోయిన కొట్నాబిల్లి రింగ్ రోడ్డు పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు చొరవతో కాంట్రాక్టర్ కొద్ది రోజులుగా రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా చేపడుతున్నారు. చినపాచిల చెరకు తూనిక కేంద్రం నుంచి కొట్నాబిల్లి మీదుగా టి.అర్జాపురం వరకూ ఎనిమిది గ్రామాలకు కలుపుతూ 12 కిలోమీటర్ల మేర ఈ రోడ్డు మట్టితో ఉండేది. ఇటు మండల కేంద్రానికి, అటు కొత్తకోటకు వెళ్లేందుకు మార్గమధ్యంలోని ఆయా గ్రామాల గిరిజన ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ స్థితిలో 2008-09లో అప్పటి జడ్పీటీసీ సభ్యుడు ఆసరి వాసుగోవిందరావు కృషితో ఈ మట్టి రోడ్డును బీటీ రహదారిగా అభివృద్ధి చేశారు.



రాళ్లు తేలిపోయి దారుణంగా తయారైన రహదారి (ఫైల్ ఫొటో)



శరవేగంగా జరుగుతున్న రహదారి నిర్మాణ పనులు

అయితే ఈ ప్రాంత గిరిజనుల రహదారి కష్టాలు తొలగాయన్న ఆనందం ఎంతో కాలం నిలవలేదు. ఈ ప్రాంతంలో విలువైన గ్రానైట్ నిక్షేపాలు పడడంతో బడా వ్యాపారుల కళ్లు వీటిపై పడ్డాయి. గ్రానైట్ తవ్వకాలు ప్రారంభిస్తే పరిసర గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు, పాఠశాలు, పలు మౌలిక సౌకర్యాలు కల్పిస్తామంటూ అడ్డదారుల్లో వ్యాపారులు గ్రానైట్ అనుమతులు పొందారు. తవ్వకాలు ప్రారంభించిన వ్యాపారులు పెద్ద పెద్ద ట్రాలర్లతో పరిమితికి మించి ఈ రోడ్డుపై గ్రానైట్ రాళ్లు తరలించడంతో అడుగడుగునా పెద్ద పెద్ద గుంతలు పడి ధ్వంసం కావడంతో గిరిజనులకు రహదారి కష్టాలు యథాతథమయ్యాయి.



ఎక్స్‌కవేటర్‌తో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న దృశ్యం

ఈ గ్రామాలలో ఎవరికి అనారోగ్య సమస్యలు వచ్చినా కనీసం 108 వాహనం కూడా రాలేని దుస్థితి. గర్భిణులకు పురిటి నొప్పులు ప్రారంభమైతే డోలీతో ఆసుపత్రికి మోసుకు వెళ్లే సందర్భాలు ఎన్నో ఉన్నాయి. దీంతో గిరిజన ప్రజలు పలు మార్లు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు రోడ్డు అభివృద్ధికి విజ్ఞప్తులు చేసినా ఫలితం దక్క లేదు. చేసేది లేక గ్రానైట్ తవ్వకాలను పలుమార్లు అడ్డగించారు. దీంతో గత ప్రభుత్వం ఎన్నికల ముందు హడావిడిగా తారు రోడ్డుగా అభివృద్ధికి అనుమతులు మంజూరు చేసి టెండర్ ఖరారు చేసింది. ఈ పనులకు టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ రోడ్డులో తవ్వకాలు చేపట్టి మెటల్ పరిచి, ఆపై నిధులు విడుదల కాలేదని నిలిపేశారు.

కూటమి ప్రభుత్వం రావడంతో...

ఐదేళ్ల రహదారిలోని గుంతలతో పడరాని పాట్లు పడ్డ గిరిజనులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సమస్య పరిష్కారమవుతుందని భావించారు. దీంతో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించి, సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి నిధుల మంజూరు చేయిస్తామని హామీ ఇవ్వడంతో రోడ్డు నిర్మాణ పనులను పునఃప్రారంభించారు. దీంతో కొట్నాబిల్లి, పరిసర ప్రాంత గిరిజన ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల ఉన్నత చదువులకు ప్రత్యేక శిక్షణ

» ఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జిల్లా సమన్వయకర్త రూపవతి



విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ రూపవతి

దేవరాపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ప్రత్యేక శిక్షణ ఇస్తామని ఉమ్మడి విశాఖ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాల సమన్వయకర్త ఎస్.రూపవతి తెలిపారు. తెనుగుపూడి గురుకుల కళాశాలలో ఆదివారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఐఐటీ, నీట్ కోసం రాష్ట్రస్థాయి ప్రతిభా పరీక్ష నిర్వహిస్తామన్నారు. వారిలో మెరిట్ సాధించిన విద్యార్థులను ఎంపిక చేసి ఉత్తరాంధ్రకు చెందిన విశాఖ శ్రీకృష్ణాపురం, చీపురుపల్లి గురకుల విద్యాలయాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థుల శతశాతం ఉత్తీర్ణతకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు. తెనుగుపూడి, గొలుగొండ, నక్కపల్లి, శ్రీకృష్ణాపురం, మేహాద్రిగెడ్డ గురుకులాల్లో భవనాల మరమ్మతుల కోసం ఒక్కో భవనానికి రూ.1.2 కోట్లు మంజూరయ్యాయన్నారు. జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో తెనుగుపూడి గురుకుల విద్యార్థులు రాణించారన్నారు. ప్రిన్సిపాల్ పాంగి రఘు తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ టోర్నమెంట్ ఏపీ కోచ్‌గా అబ్బు



కోచ్ అబ్బు

నర్సీపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో న్యూ ఢిల్లీలో జరిగే అండర్-17 బాక్సింగ్ టోర్నమెంట్‌కు ఆంధ్రప్రదేశ్ టీమ్‌కు కోచ్‌గా అబ్బును ఎంపిక చేసినట్టు ద్రోణాచర్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ నెల 8 నుంచి 15వ తేదీ వరకు న్యూ ఢిల్లీలోని ఇండోర్ స్టేడియంలో బాక్సింగ్ టోర్నమెంట్ జరుగుతుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ టీమ్‌కు అబ్బు కోచ్‌గా ఎంపిక కావడం పట్ల నింజాస్ అకాడమీ డైరెక్టర్ వెలగా నారాయణరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

భగవద్గీత శ్లోకాల పఠనం పోటీలు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

చోడవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం, అన్నమాచార్య సంగీత పీఠం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ప్రేమ సమాజంలో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పఠనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతితో పాటు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అన్నమాచార్య సంగీత పీఠం రామయ్యరెడ్డి పర్యవేక్షణలో పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ రామారావు, పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

108 వాహనంలో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం



108 వాహనంలో ప్రసవించిన గర్భిణి

చోడవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు లక్ష్మీపురం రోడ్డులో ఆదివారం ఉదయం 108 వాహనంలో గర్భిణ ప్రసవించింది. లక్ష్మీపురం గ్రామానికి చెందిన పేరపు లక్ష్మి ఆదివారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో ఆమె బంధువులు 108కి కాల్ చేశారు. లక్ష్మీపురం గ్రామం నుంచి గర్భిణిని 108 వాహనంలో స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రికి తీసుకు వస్తుండగా, టీచర్స్ కాలనీ సమీపంలో నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108 సిబ్బంది ఏడువాక నాయుడు, గణేశ్ ఆమెకు చికిత్స అందించి సుఖంగా ప్రసవమయ్యేలా చూశారు. ఆమె పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను కమ్యూనిటీ ఆసుపత్రిలో చేర్చారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉండడంతో గ్రామస్థులు 108 సిబ్బందిని అభినందించారు.

వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు సత్కారం

తుమ్మపాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైతుల శిక్షణ కేంద్రంలో ఆదివారం వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుల ఎన్నిక నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షునిగా త్రివిక్రమరావు, కార్యదర్శిగా కేవీ సూర్యనారాయణ, కోశాధికారిగా నారాయణలు ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా రమణ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా చినదేముడు ఎన్నికయ్యారు. సంఘం అభ్యున్నతికి కృషి చేస్తామని కొత్త కార్యవర్గ సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదరి కేవీ సత్యనారాయణ, కోశాధికారి సుబానీ తదితరులు పాల్గొన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

దేవరాపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అలమండ గ్రామంలో సోమవారం మధ్యాహ్నం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభిస్తారని కార్యాలయ సిబ్బంది తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా పౌర సరపరాల శాఖ అధికారి పాల్గొంటారన్నారు.

నేడు లేగ దూడల ప్రదర్శన

దేవరాపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగయ్యపేట గ్రామంలో సోమవారం లేగ దూడల ప్రదర్శన నిర్వహించనున్నట్టు పశు వైద్యాధికారి కేహెచ్‌పీ.మంజుషారాణి తెలిపారు. రైతులకు లేగ దూడల పెంపకం, వాటి ఉపయోగంపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. రైతులు లేగ దూడలను తీసుకురావాలని ఆమె సూచించారు.

ఉత్సాహంగా గిరిజన సమ్మేళనం

ఎండాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గీతం ఆసుపత్రి ఆడిటోరియంలో నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ (మై భారత్) ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న 16వ జాతీయ గిరిజన యువ సమ్మేళనం ఉత్సాహంగా సాగుతోంది. ఆదివారం చత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన ఆదివాసీ యువత పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. అనంతరం నిర్వాహకులు జాతి నిర్మాణంలో ఆదివాసీల దేశ భక్తి అన్న అంశంపై డిబేట్ పోటీ నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లా ఎన్‌వీకే అధికారి గొర్లె మహేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్‌వీకే శ్రీకాకుళం జిల్లా అధికారి కె.వెంకట్ ఉజ్వల్, ఏవో పృథ్వీ అల్లం రామ్ ప్రసాద్, ప్రసన్న శ్వేత, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి

» రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ తాతయ్యబాబుకు వినతి

రావికమతం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కోరారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబుకు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కాలనీ ఇళ్లు, ఉపాధి పథకంలో పనులను చేయించే బాధ్యత నుంచి సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లను తప్పించాలని విన్నవించారు. ప్రస్తుతం పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, గృహ నిర్మాణ, గ్రామీణ నీటి సరఫరా శాఖల పనులు కూడా తామే చేస్తున్నామని, ఏదో ఒక శాఖలో తమను విలీనం చేయాలని కోరారు. రావికమతం మండలంలో 28 గ్రామ పంచాయతీల పరిధిలోని 22 గ్రామ సచివాలయాలు ఉండగా ఏడుగురు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు మాత్రమే ఉండడంతో విధి నిర్వహణ కష్టతరమవుతున్నదని వారు తాతయ్యబాబుకు వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కులుకూరి నరేశ్, కె.శ్రీను, ఎం.బాలకృష్ణ, శివాజీ, రమేశ్, అనకాపల్లి అసోయేషన్ సభ్యులు పాల్గొన్నారు.



సమస్యలపై తాతయ్యబాబుకు వినతిపత్రం అందిస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లు

చోద్యంలో 300 లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం



బెల్లం పులుసు ధ్వంసం చేస్తున్న పోలీసులు

కృష్ణాదేవిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని చోద్యం బోడ్డేరు గెడ్డ సమీపంలో కొండపై సారా బట్టీలపై దాడులు చేసి 300 లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేసినట్టు కృష్ణాదేవిపేట ఎస్ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. ఆదివారం సిబ్బందితో వెళ్లి సారా తయారీకి ఉపయోగించే గిన్నెలు, డ్రమ్ములు, ఇతర సామగ్రిని ధ్వంసం చేసినట్టు చెప్పారు. గ్రామాల్లో గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, సారా విక్రయాలు, తయారీ చేస్తే ప్రజలు పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎస్ఐ సూచించారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది చిరంజీవి, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

దేవరాపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెనుగుపూడి గురుకుల విద్యాలయంలో 1995-2001 బ్యాచ్‌లో చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అంతేకాకుండా అప్పటి నుంచి పనిచేసిన ఉపాధ్యాయులను సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. జిల్లా కోఆర్డినేటర్ ఎస్.రూపవతి, ప్రిన్సిపాల్ పాంగి రఘు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

మాకవరపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నర్సీపట్నానికి చెందిన లలితా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్స్, స్కిన్, కార్డియాలజీ వైద్యులతో ఈ శిబిరం నిర్వహించారు. మాకవరపాలెం, తామరం గ్రామాల నుంచి 160 మంది తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లాలం రాము, టీడీపీ నేత రుత్తల నాని, వైద్యులు హనుతేజ్,పృధ్విరాజ్, రుత్తల తాతజీ పాల్గొన్నారు.



రోగులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

రూ.45 లక్షలలో డ్రైనేజీ పూడికతీత పనులు

నర్సీపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని పలు వార్డుల్లో కాలువలలో పూడికతీత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రూ.45 లక్షలతో మొత్తం 17 పనులు చేస్తున్నారు. పెదబొడ్డేపల్లి రావిచెట్టు నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు, పాల్‌ఘాట్ సెంటర్ నుంచి దుర్గాగుడి వరకు, సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి ట్రెడ్స్ షాపు, దుర్గా గుడి నుంచి పెదబొడ్డేపల్లి మదుం, టీటీడీ కల్యాణ మండపం నుంచి ఏకా రాజబాబు ఇంటి వరకు, పోలీస్ స్టేషన్ నుంచి అబీద్ సెంటర్, ఏరియా ఆస్పత్రి వెనక నుంచి పొక్కునూరు నాగేశ్వరరావు ఇంటి వరకు, పాత ఎస్‌బీఐ నుంచి బంగార్రాజు థియేటర్ కూడలి వరకు డ్రైనేజీలోని పూడిక తీత పనులు చేపడుతున్నామని కమిషనర్ సురేంద్ర తెలిపారు. వీటితో పాటు మరికొన్ని పనులు కూడా చేపడతామని చెప్పారు.

టీడీపీ సభ్యత్వ నమోదును ముమ్మరం చేయండి

రోలుగుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పంచాయతీల్లో టీడీపీ సభ్యత్వ నమోదును ముమ్మరం చేయాలని ఐటీడీపీ మండల ఇన్‌చార్జి బంటు రాజు తెలిపారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ నిర్దేశిత సమయంలోగా వంద శాతం సభ్యత్వ నమోదును పూర్తిచేయాలని కోరారు. మండల వ్యాప్తంగా 75 శాతం నమోదైనట్టు ఆయన చెప్పారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యకర్తకు భరోసా ఇస్తుందన్నారు. రూ.100తో రూ.5 లక్షల బీమా సదుపాయాన్ని పార్టీ కల్పిస్తుందన్నారు. అలాగే ఇతర అనేక ప్రయోజనాలు ఉన్నాయని పేర్కొన్నారు.

పింఛన్ల పరిశీలన పారదర్శకంగా నిర్వహించాలి

చీడికాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పింఛన్ల పరిశీలన ప్రక్రియను అధికారులు పారదర్శకంగా నిర్వహించాలని సీపీఎం మండల కార్యదర్శి రొంగలి దేముడునాయుడు కోరారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ వివిధ పార్టీల నాయకులు ఓట్ల కోసం వితంతు, వృద్ధాప్య పింఛన్ల సంఖ్యను భారీఎ ్తాయిలో పెంచారన్నారు. దీనికి అర్హులైన పేదవారు, 60 ఏళ్లు పైబడినవారు, దివ్యాంగులు తీసుకోవడం మంచిదేనని, ఇదే అదునుగా వయస్సు తక్కువ ఉన్నవారు ఆధార్ కార్డులను మార్చుకొని పింఛన్‌లు తీసుకొంటున్నారనే ఆరోపణలు ఉన్నాయని చెప్పారు. దివ్యాంగుల పింఛన్లు తీసుకుంటున్న వారి సర్టిఫికెట్‌లను వైద్య నిపుణులతో పాటు శారీరకంగా కూడా పరిశీలిస్తే నకిలీలు బయటపడతారని అన్నారు. అధికారులు పారదర్శకంగా పరిశీలన చేస్తే అర్హులకు న్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో దత్తాత్రేయ పూజలు

మాడుగుల రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరవెల్లి అగ్రహారంలో ఆదివారం దత్త జయంతి సప్తాహ మహోత్సవం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక శ్రీనివాస భరణి శర్మ ఆధ్వర్యంలో దత్తాత్రేయునికి పూజలు, భజనలు జరిగాయి.

బండరాళ్లు తరలిస్తున్న రెండు లారీలు ఢీ

» లారీల మధ్య తెగిపడిన ఓ డ్రైవర్ కుడి కాలు » కుటుంబ పోషణ ఎట్లా అంటూ విలపించిన క్షతగాత్రుడు » సోమన్నపాలెం వద్ద ప్రమాదం



సోమన్నపాలెం వద్ద ప్రమాదానికి గురైన రెండు లారీలు రోడ్డుపై పడిన బండరాళ్లు

ఎలమంచిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమన్నపాలెం గ్రామం పాత జాతీయ రహదారి జంక్షన్ వద్ద ఆదివారం బండరాళ్లు తరలిస్తున్న రెండు లారీలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కశింకోట మండలం కన్నూరుపాలెం సమీపంలోని ఆనందపురం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ లాలం గొల్లబాబు కుడికాలు తెగిపడింది. వెంటనే 108 వాహనంలో పోలీసుల సహాయంతో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మరో లారీ డ్రైవర్ మాకవరపాలెం మండలం రామారాయుడు పాలెం గ్రామానికి చెందిన మర్రి దేముడుకు స్వల్ప గాయాలయ్యాయి. లారీ బోల్తాతో రోడ్డంతా నల్లబండరాళ్లు పడిపోయాయి. వెనుక ఉన్న లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో ముందుభాగం నుజ్జయ్యింది. ప్రమాద స్థలం భయానకంగా ఉంది. లారీ శకటాల మధ్య ఇరుక్కుపోయిన గొల్లబాబును రక్షించేందుకు స్థానికులు, హోంగార్డు చంటి తీవ్రంగా యత్నించి బయటకు తీశారు. ఈ ప్రమాదంతో రోడ్డు పొడుగునా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. లారీ డ్రైవర్ దేముడు తెలిపిన సమాచారం ప్రకారం... రోలుగుంట ప్రాంతం నుంచి నల్లబండరాళ్లను రాంబిల్లి తరలించేందుకు వస్తుండగా సోమన్నపాలెం వద్దకు వచ్చేసరికి ముందుగా వెళ్తున్న కారు అడ్డుగా వచ్చింది. దాన్ని తప్పించే క్రమంలో లారీ అదుపు తప్పింది. వెనుక నుంచి మరో లారీ వచ్చి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని తెలిపాడు. ప్రమాద స్థలానికి రూరల్ ఎస్సై ఉపేంద్ర తన సిబ్బందితో చేరుకుని ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. కాలు తెగిపడిపోయిన డ్రైవర్ గొల్లబాబు తీవ్రంగా విలపిస్తూ... తనకు భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారని, తన కుటుంబాన్ని ఎలా పోషించగలను దేవుడా! అంటూ విలపించిన తీరు చూపరులను కంటతడిపెట్టించింది.



కాలు తెగిపడిన గొల్లబాబును ఆసుపత్రికి తరలించేందుకు 108 వాహనం వద్దకు తీసుకెళ్తున్న ఎస్ఐ, స్థానికులు



గొలుగొండలో కాపువీధిలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

రహదారులపై మురుగు నీటి ప్రవాహం

గొలుగొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రహదారులపై మురుగునీరు ఏరులై పారుతోంది. కాపువీధిలోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయం వద్ద గతంలో సిమెంట్ రోడు నిర్మించారు. అయితే రోడ్డుకిరువైపులా కాలువలను నిర్మించకపోవడంతో వాడుక నీరు రోడ్డుపైకి వచ్చేస్తున్నది. రోజుల తరబడి నీరు నిల్వ ఉండిపోవడంతో భరించలేని దుర్వాసన వస్తున్నదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి రోడ్డుకిరువైపులా కాలువలు నిర్మించాలని వారు కోరుతున్నారు.

నేడు హౌస్ కమిటీ రాక

విశాఖ డెయిరీలో అక్రమాలపై విచారణ

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీలో అక్రమాలపై విచారణకు నియమించిన హౌస్‌కమిటీ సోమవారం అక్కిరెడ్డిపాలెంలోని డెయిరీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించనుంది. హౌస్ కమిటీ చైర్మన్ జ్యోతుల నెహ్రూ, సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు, పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, గౌతు శిరీష, ఆర్‌వీఎస్‌కేకేవీ రంగారావు, దాట్ల సుబ్బరాజు సోమవారం ఉదయం నగరంలోని దసపల్లా హోటల్‌కు చేరుకుని, అక్కడి నుంచి డెయిరీకి వెళ్తారు. డెయిరీ అధికారులతో మాట్లాడిన అనంతరం, రికార్డులు తనిఖీ చేస్తారు. రైతులు, కార్మికుల నుంచి వినతులు స్వీకరించనున్నారు. విశాఖ డెయిరీ మొత్తం ఆడారి తులసీరావు కుటుంబసభ్యుల గుప్పిట్లో ఉండడంతో పాటు భారీగా అక్రమాలు జరిగాయని ఇటీవల ఫిర్యాదులు వెల్లువెత్తడంతో హౌస్‌కమిటీని నియమించిన విషయం తెలిసిందే.